# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 233

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy | సంపాదకులు : కె.భాస్కర్‌రావు | రూ.2.00/- పేజీలు 8 | తేది: ఆదివారం 27 సెప్టెంబర్ 2026






## ట్రేడ్ షో గ్రాండ్ సక్సెస్!

**సమయం ప్రతినిధి:** ఉత్తర్ ప్రదేశ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ షో (UPITS) 2026 వేదికగా యూపీ పారిశ్రామికాభివృద్ధికి కీలక అడుగు పడింది. యమునా ఎక్స్‌ప్రెస్‌వే ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ (YEIDA) పరిధిలో వివిధ రంగాలకు చెందిన ఐదు ప్రముఖ సంస్థలకు రూ. 469 కోట్ల అంచనా వ్యయంతో పారిశ్రామిక ప్రాజెక్టుల ఏర్పాటుకు స్థల కేటాయింపు పత్రాలను కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా అందించారు. ఈ కేటాయింపుల ద్వారా YEIDA ప్రాంతంలో మొత్తం 71,190 చదరపు మీటర్ల భూమిని కేటాయించారు. ఈ ఐదు ప్రాజెక్టులు అందుబాటులోకి రావడం ద్వారా దాదాపు 4,625 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. కేవలం పెట్టుబడి ప్రతిపాదనల స్థాయిలోనే కాకుండా, వాటిని నేరుగా క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి ఈ కార్యక్రమం బాటలు వేసింది. కేటాయింపు పత్రాల అందజేత అనంతరం పారిశ్రామికవేత్తలతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ముఖాముఖి మాట్లాడారు. ఉత్తర్ ప్రదేశ్‌లో పారిశ్రామిక రంగాన్ని వేగవంతం చేయడం, స్థానిక తయారీ శక్తిని పెంచడం, సరఫరా గొలుసును బలోపేతం చేయడంపై ఆయన చర్చించారు. ప్రతిపాదించిన ప్రాజెక్టులు త్వరగా ఉత్పత్తి దశకు చేరుకునేలా పనులు వేగవంతం చేయాలని ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలను అమిత్ షా కోరారు. భూమి పొందిన సంస్థల్లో సీ అండ్ ఆర్ టెక్స్‌టైల్స్, పర్ఫెక్ట్‌ప్యాక్ లిమిటెడ్, వాూదీా ఎక్స్‌పోర్ట్స్ ఇంటర్నేషనల్, సింప్లాస్ట్ ఇండియా, సాహు ఎక్స్‌పోర్ట్స్ ఉన్నాయి.



## సర్‌పై కీలక నిర్ణయం..

**సమయం ప్రతినిధి:** ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం (CEC) కీలక నిర్ణయం తీసుకుంది. SIRకు సంబంధించి నోటీసులు అందుకున్న ఓటర్లు ఇకపై తప్పనిసరిగా బూత్ లెవల్ అధికారులను (BLO) స్వయంగా కలవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఓటర్లకు మరింత సౌకర్యంగా ఉండేలా ప్రక్రియను సులభతరం చేస్తున్నట్లు తెలిపింది. నోటీసులు అందుకున్న ఓటర్ల ఇళ్లకే BLOలు వెళ్లి అవసరమైన వివరాలు, పత్రాలను సేకరిస్తారని CEC వెల్లడించింది. ఓటర్లు కార్యాలయాలు లేదా BLOల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దే ప్రక్రియను పూర్తి చేసుకునే అవకాశం కల్పించింది. అంతేకాకుండా, ఓటర్లు సమర్పించే అవసరమైన డాక్యుమెంట్లను BLOæ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారని CEC తెలిపింది. దీంతో పత్రాల సమర్పణ, అప్‌లోడ్ విషయంలో ఓటర్లపై అదనపు భారం ఉండదని స్పష్టం చేసింది. SIR ప్రక్రియలో భాగంగా ఓటర్ల వివరాల పరిశీలన, అర్హతకు సంబంధించిన పత్రాల ధ్రువీకరణ వంటి అంశాలను BLOలు ఇంటింటికీ వెళ్లి చేపట్టనున్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమకు అందుబాటులో ఉన్న సంబంధిత పత్రాలను దీూలకు అందిస్తే సరిపోతుందని ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ నిర్ణయం ద్వారా SIR ప్రక్రియలో ఓటర్లకు ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించడంతో పాటు, పత్రాల సమర్పణ ప్రక్రియను మరింత సులభతరం చేయాలని జజుజ భావిస్తోంది.



## బీజేపీ గెలుపు కోసమే సర్..

**సమయం ప్రతినిధి:** బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందడానికే ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్వహించిందని ఆ రాష్ట్ర మాజీ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటరు జాబితాల నుంచి అసలైన ఓటర్ల పేర్లను తొలగించారని ఆమె అన్నారు. ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని, దీనికి బాధ్యతవహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. శనివారం సేరంపోర్‌లో నిర్వహించిన ర్యాలీలో మమత మాట్లాడారు. సర్ ప్రక్రియపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లే అభ్యంతరాలు వ్యక్తం చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు నిజం బయట పడిందన్నారు. సీఈసీ రాజీనామా చేయాలని, లేకపోతే బెంగాల్ వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే ఈనెల 30న ఇండియా కూటమి సమావేశం ఢిల్లీ కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు.

**మా లీడర్లను నిర్బంధించారు :** తమ వర్గానికి చెందిన టీఎంసీ నాయకులు, కార్యకర్తలు సేరంపోర్‌లో ర్యాలీకి హాజరుకాకుండా వారిని పోలీసులు గృహ నిర్బంధం చేశారని మమతా బెనర్జీ ఆరోపించారు. అంతేకాకుండా తనను కూడా ర్యాలీ వేదిక వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారని తెలిపారు. దీంతో ప్రత్యామ్నాయ మార్గం ద్వారా సేరంపోర్‌కు వచ్చి ర్యాలీలో పాల్గొన్నానని చెప్పారు. "సేరంపోర్ ర్యాలీకి రాకుండా నన్ను అడ్డుకునేందుకు బీజేపీ గూండాలు నా మార్గాన్ని ఆక్రమించారు.



## భద్రతలో రాజీ లేదు

**హైదరాబాద్, సెప్టెంబర్ 26, సమయం ప్రతినిధి :** కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మూడు బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించిన డిజైన్లను ఇప్పటికే ఖరారు చేసినట్లు పేర్కొన్న ఆయన.. అక్టోబర్ 5న కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక కమిటీ ముందుకు వాటిని తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు. పుణేలోని సీడబ్ల్యూఆర్‌పీఎస్‌లో డిజైన్లపై శాస్త్రీయ నమూనా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) వ్యక్తం చేసిన అభ్యంతరాలు.. వివిధ రంగాల నిపుణులు అందించిన సూచనలను పరిగణనలోకి తీసుకుని పునరుద్ధరణ డిజైన్లను రూపొందించినట్లు మంత్రి వివరించారు. సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే టెండర్ల ప్రక్రియ చేపట్టి పనులు ప్రారంభిస్తామని.. నవంబర్ మధ్య నాటికి మూడు బ్యారేజీల వద్ద పునరుద్ధరణ పనులు మొదలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 2027 వర్షాకాలం ప్రారంభమయ్యేలోపే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. బ్యారేజీల పునరుద్ధరణలో తాత్కాలిక మరమ్మతులకు ప్రాధాన్యం ఇవ్వకుండా.. భవిష్యత్‌లోనూ బ్యారేజీల భద్రతకు భరోసా కల్పించేలా దీర్ఘకాలిక పరిష్కారాలను అమలు చేస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మూడు బ్యారేజీల పునాదులను గ్రౌటింగ్ ద్వారా మరింత బలోపేతం చేయడంతో పాటు, స్టిల్లింగ్ బేసిన్లను పొడిగించడం, అవసరమైన ప్రాంతాల్లో కొత్త కట్-ఆఫ్ వాల్స్ నిర్మించడం వంటి కీలక పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.

## తెలంగాణ విద్యుత్ రంగంలో సరికొత్త మైలురాయి



**హైదరాబాద్, సెప్టెంబర్ 26, సమయం ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను అధిగమించడానికి, రాష్ట్రాన్ని విద్యుత్ మిగులు దిశగా తీసుకెళ్లేందుకు తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (TGGENCO) భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి (విద్యుత్ శాఖ మంత్రి) మల్లు భట్టి విక్రమార్కల స్పష్టమైన ఆదేశాల మేరకు దామరచర్ల వద్ద నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ద్వారా ప్రతిరోజూ 140 మిలియన్ యూనిట్ల (MU) విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు అవసరమైన కసరత్తు వేగవంతమైంది. యాదాద్రి ప్రాజెక్ట్ అందుబాటులోకి రావడంతో TGGENCO మొత్తం థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ప్రస్తుతం ఉన్న 4,042.5 మెగావాట్ల (వీఔ) నుంచి ఏకంగా 7,180 మెగావాట్లకు (వీఔ) పెరగనుంది. యాదాద్రి ప్లాంట్‌లో ఒక్కొక్కటి 800 వీఔ సామర్థ్యం కలిగిన మొత్తం 5 యూనిట్లు (3,200 MW) నిర్మిస్తున్నారు. పర్యావరణ అనుమతులు, సాంకేతిక చిక్కుల కారణంగా నిలిచిపోయిన పనుల్లో 2024లో మళ్లీ కదలిక వచ్చింది. 2024లోనే ప్రాజెక్ట్ యూనిట్లను గ్రిడ్‌కు అనుసంధానించగా, 2025 జనవరిలో తొలి 800 వీఔ యూనిట్ ద్వారా ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభమైంది. రాబోయే ఆరు నెలల్లో మిగిలిన నిర్మాణ, సాంకేతిక పనులన్నింటినీ పూర్తి చేసి, ప్లాంట్‌ను పూర్తిస్థాయి సామర్థ్యంతో నడపాలని రేవంత్ ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుంది.

## న్యాయ సేవలను గ్రామీణ స్థాయికి చేర్చడమే లక్ష్యం




**సమయం: సెప్టెంబర్ 26, కోయిలకొండ, మహబూబ్‌నగర్ :** న్యాయ సేవలను గ్రామీణ ప్రాంతాల ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతున్నామని జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ఎస్. ప్రేమలత అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు శనివారం కోయిలకొండ మండలం అయ్యవారిపల్లి గ్రామంలో న్యాయ అవగాహన సదస్సుతో పాటు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రిన్సిపల్ జడ్జి మాట్లాడుతూ సుప్రీంకోర్టు సూచనల మేరకు అయ్యవారిపల్లి గ్రామాన్ని మెగా డ్రైవ్ కింద ఎంపిక చేసి ప్రజలకు న్యాయ సేవలను అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామంలో నెలరోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహించి, పేదలకు అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, హక్కులు అందుతున్నాయా లేదా అనే అంశాలపై వివరాలు సేకరించి నివేదికలు రూపొందిస్తామని చెప్పారు. అనంతరం సంబంధిత ప్రభుత్వ శాఖలకు ప్రతిపాదనలు పంపించి అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. పేదరిక నిర్మూలనకు గ్రామంలో చేపట్టాల్సిన చర్యలను చట్టపరంగా ముందుకు తీసుకెళ్లేందుకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కృషి చేస్తోందన్నారు. గ్రామ ప్రజలు తమ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని,

**పేదలకు సంక్షేమ పథకాలు అందేలా చట్టపరమైన సహకారం**

**జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ఎస్. ప్రేమలత**

చిన్నచిన్న వివాదాలను పట్టింపులకు తీసుకెళ్లి గొడవలు పెట్టుకొని కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. సమస్యలు తలెత్తినప్పుడు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను ఆశ్రయించి రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు న్యాయం సక్రమంగా అందడం లేదని పలు నివేదికలు సూచిస్తున్నాయని పేర్కొన్నారు. పారా లీగల్ వాలంటీర్లు గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకొని, ఇరువర్గాల అభిప్రాయాలను అర్థం చేసుకుని, తీవ్రమైన సమస్య కాకపోతే ప్రాథమిక దశలోనే పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు. న్యాయాన్ని సామాన్యులకు చేరువ చేయాలనే ఉద్దేశంతోనే ఈ మెగా డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి. ఇందిర మాట్లాడుతూ హైదరాబాద్ ఎం.ఎన్.జే క్యాన్సర్ ఆస్పత్రి, జిల్లా జనరల్ ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య పరీక్షలు, చికిత్సలు చేయించుకోవాలని సూచించారు.

**విజయవంతంగా ఉచిత వైద్య శిబిరం**

అయ్యవారిపల్లిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామస్థుల నుంచి మంచి స్పందన లభించింది. ఎం.ఎన్.జే క్యాన్సర్ ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో గ్రామస్థులకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. జిల్లా జనరల్ ఆస్పత్రి వైద్యులు వివిధ రకాల వైద్య పరీక్షలు, చికిత్సలు అందించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులకు జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ఎస్. ప్రేమలత చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. అర్హులైన వారికి యు.డి.ఐ.డి. కార్డులు, కార్మిక కార్డులను కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి (కుటుంబ న్యాయస్థానం) పి. ఆంజనేయులు, నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి మహమ్మద్ అఫ్రోజ్ అక్తర్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డి. ఇందిర, ఎం.ఎన్.జే క్యాన్సర్ ఆస్పత్రి వైద్యురాలు కీర్తన, జిల్లా సంక్షేమ అధికారి జరిన బేగం, ఎంపీడీవో ధనుంజయ గౌడ్, గ్రామ సర్పంచ్ వాగ్య రాము నాయక్, చైల్డ్‌లైన్ ప్రతినిధి చంద్రశేఖర్, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



## బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ పోరాటం చిరస్మరణీయం

**జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ ముదిరాజ్**

సమయం: సెప్టెంబర్ 26, మహబూబ్‌నగర్: బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన వీరోచిత పోరాటం, త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ ముదిరాజ్, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పద్మావతి కాలనీలో శుక్రవారం చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ ముదిరాజ్, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడారని పేర్కొన్నారు. ఆమె చేసిన పోరాటం, త్యాగాలు సామాజిక న్యాయం, సమానత్వం కోసం కృషి చేసే ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ఐలమ్మ ఆశయాలను నేటి తరానికి తెలియజేస్తూ, ఆమె చూపిన ధైర్యసాహసాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్‌రెడ్డి, పలువురు డివిజన్ల కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సంపాదకీయం

## భారత్‌కు వీటో హక్కు లభించేనా?

విదేశీ వ్యవహారాలలో మొదటి నుంచీ గాంధీజీ ఉపదేశించిన అహింస, శాంతి, సహకారం వంటి విలువల మార్గంలో పయనించే భారత్‌కు అంతర్జాతీయంగా ఎనలేని పలుకుబడి, ప్రతిష్ఠ ఉన్నాయి. విస్తృత ప్రపంచం పట్ల అనుకూల వైఖరితో వ్యవహరించడం, జాతీయ సార్వభౌమత్వాల ప్రాదేశిక సమగ్రతపై రాజీ లేని వైఖరి అవలంబించడం మన విదేశాంగ విధాన మౌలిక స్వభావం. దేశాన్ని పాలించేది ఎవరైనా, అధికారంలో ఉన్నది ఏ పార్టీ అయినా మన విదేశాంగ విధానాన్ని ఎప్పటికప్పుడు బలోపేతం చేయడం గర్వకారణం. ఇటీవల న్యూఢిల్లీ వేదికగా భారత్ ఆతిథ్యం ఇచ్చిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో చైనా మొట్టమొదటిసారిగా భారత్‌కు అనుకూలంగా మాట్లాడి పాకిస్థాన్‌కు ఝలక్ ఇచ్చింది. కశ్మీర్‌లోని పహల్గామ్‌లో అమాయకులైన యాత్రికులపై పాకిస్థాన్ ముష్కరులు దాడిచేసి అమానుషంగా వారిని కాల్చి చంపిన ఉగ్రవాద చర్యను చైనా ఖండించడం భారత్ సాధించిన పాక్షిక దౌత్య విజయంగా చెప్పాలి. అంతేకాదు, బ్రిక్స్ న్యూఢిల్లీ సదస్సులో పాల్గొన్న ఇరాన్ తనపై యుద్ధం చేస్తున్న అమెరికా ప్రస్తావన తీసుకురాకుండా బ్రిక్స్ అజెండాకు పరిమితం కావడం కూడా భారత్ అవలంబించిన దౌత్యనీతిలో భాగమేనని చెప్పాలి. ఆధునిక యుగ ప్రపంచ చరిత్రలో భారత జాతీయోద్యమానికి ఎంతో ప్రత్యేకత ఉంది. బ్రిటిషు వలస పాలకుల అణచివేత, హింస, దోపిడీలకు వ్యతిరేకంగా అహింసా మార్గంలో భారతీయులు చేసిన పోరాటం అంతర్జాతీయ సమాజానికి గొప్ప స్ఫూర్తినిచ్చింది స్వాతంత్ర్యం లభించిన తర్వాత మనం ఏర్పాటు చేసుకున్న సుదృఢమైన రాజ్యాంగం, దాని ద్వారా దేశ పౌరులకు సంక్రమించిన ప్రాథమిక హక్కులు, రాజ్యాంగబద్ధంగా పాలన చేసే ప్రజా ప్రభుత్వాల ఏర్పాటు.. తదితర ప్రజాస్వామ్య పరిణామాలన్నీ ప్రపంచాన్ని విస్తుపోయేలా చేశాయి. ముఖ్యంగా ప్రపంచ దేశాలు రెండుగా చీలి అటు అమెరికా, ఇటు రష్యాల శిబిరాల పక్కన చేరిన సందర్భంలో భారత్ తటస్థ వైఖరి అవలంబించి అలీనోద్యమానికి అంకురార్పణ చేసింది. నాటి పండిట్ నెహ్రూ నుంచి నేటి నరేంద్ర మోదీ వరకు మన విదేశాంగ విధానం మౌలికంగా ఎటువంటి మార్పు లేకుండా కొనసాగుతూ వస్తోంది. ఈ విశిష్టతే అంతర్జాతీయ సమాజంలో భారత్‌కు ఒక ప్రత్యేక ప్రాధాన్యాన్ని సమకూర్చుతోంది. బ్రిక్స్ న్యూఢిల్లీ సదస్సులో సాధించిన పాక్షిక విజయంతోనే భారత్ సంతృప్తి చెందకూడదు. దౌత్యపరంగా ఇంకా అనేక సవాళ్లు దేశం ముందున్నాయి. పొరుగు పాకిస్థాన్ ఇంకా పక్కలో బల్లెంగానే ఉంది. అంతర్జాతీయ వాణిజ్యంలో వెనుకబడే ఉన్నాము. ఇవన్నీ దేశ సత్వర అభివృద్ధికి అవరోధమవుతున్నాయి. ముఖ్యంగా 1991లో పీవీ నరసింహారావు ప్రభుత్వం ఆనాటి దేశ ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దే క్రమంలో జాతి ప్రయోజనాలకు దీర్ఘకాలంలో జరిగే నష్టాలను బేరీజు వేసుకోకుండా ప్రపంచీకరణ విధానాలను అనుసరించింది. అందులో భాగంగా చేసుకున్న అనేక అంతర్జాతీయ ఒప్పందాలు నేడు భారత్‌కు ప్రతికూలంగా పరిణమించాయి. ఎగుమతులు దిగుమతుల రంగంలో మన సొంత ఉత్పత్తిని పణంగా పెట్టి రాయితీలతో దిగుమతులు అనుమతించాము. దీనివల్ల వ్యవసాయంతో సహా పలు రంగాలు దెబ్బతిన్నాయి. దేశ జనాభాలో సగానికి పైగా ఆధారపడిన మన వ్యవసాయ రంగం విదేశీ సబ్సిడీ ఉత్పత్తుల పోటీని తట్టుకోలేకపోయింది. దేశీయ మార్కెట్లలో తమ ఉత్పత్తులకు సరైన మద్దతు ధర లభించక వ్యవసాయదారులు నష్టాల ఊబిలో కూరుకొని పోతున్నారు. మన రైతాంగానికి రక్షణ కల్పించేందుకు అమెరికాతో సహా వివిధ దేశాలతో కుదుర్చుకున్న వ్యవసాయ, వాణిజ్య ఒప్పందాలను ఇప్పటికైనా సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఇందుకు దౌత్యపరమైన సంప్రదింపులే శరణ్యం. అలాగే తయారీ రంగంలో భారత్ అవకాశాలు కోల్పోయింది. ప్రపంచీకరణ వల్ల చైనా తన తయారీ రంగాన్ని ప్రపంచంలోనే అత్యున్నత స్థాయికి చేర్చి 'వరల్డ్ ఫ్యాక్టరీ'గా చేసుకోగలిగింది. పాక్షిక నైపుణ్యాలు కలిగిన కార్మికులకు ఉపాధి కల్పించగలిగే మన తయారీ రంగం దెబ్బ తినడంతో దేశంలో ఉపాధి లేమి ఏర్పడి ఆర్థిక అంతరాలు పెరిగిపోయాయి. ఆర్థిక వ్యవస్థల ప్రపంచీకరణతో ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు రావడంతో వాటిని వెతుక్కుంటూ మన యువ విద్యాధికులు తరలిపోయారు. అంటే దేశీయ వనరులతో చదువుకున్న విద్యావంతుల ప్రతిభ ఇతర దేశాలకు ఉపయోగపడింది! మన విద్యావంతుల ప్రతిభను ఉపయోగించుకొని ఇక్కడే గ్లోబల్ బ్రాండ్లను సృష్టించే అవకాశాన్ని భారత్ కోల్పోయింది. మరోవైపు బహుళ జాతి సంస్థలు సువిశాల భారతీయ విపణిలో ప్రవేశించడం వల్ల మన సంప్రదాయ కుటీర పరిశ్రమలు, చేనేత కార్మికులు, చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. చిన్న తరహా పరిశ్రమలు చాలా వరకు మూతపడ్డాయి. విద్య, వైద్య రంగాల ప్రైవేటీకరణతో పేద మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం దూరమయ్యాయి. ఆర్థికాభివృద్ధి, సాంకేతిక పురోగతి సాధించినప్పటికీ స్వయం తప్పిదాల వల్ల భారత్ కొన్ని రంగాలలో వెనుకబడి ఉంది. ఈ అంశాలను ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్ పదే పదే ప్రస్తావిస్తున్నారు. ఈ అనివార్య ప్రస్తావనలను నాటి పీవీ నరసింహారావు, ఆ తర్వాత డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వాల వాణిజ్య విధానాలను విమర్శించడంగా చూడడం సబబు కాదు. వర్తమాన ప్రపంచ వాస్తవిక పరిస్థితులకు అనుగుణంగా వాటిని విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ప్రపంచీకరణ కొన్ని దేశాలకు వరంగా, మరికొన్ని దేశాలకు శాపంగా మారిన మాట నిజం. ప్రపంచీకరణ పేరుతో ప్రపంచ వాణిజ్య సంస్థతో భారత్ కుదుర్చుకున్న కొన్ని ఒప్పందాలు నేటికీ మన ఆర్థిక వ్యవస్థ పురోగతికి గుదిబండలుగా ఉన్నాయి. ఈ దృష్ట్యా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 40 శాతం వాటా ఉన్న బ్రిక్స్ దేశాల నడుమ దృఢమైన ఆర్థిక, వ్యాపార, వాణిజ్య సంబంధాలు వర్ధిల్లితే మన దేశానికి చాలా మేలు జరుగుతుంది. ముఖ్యంగా బ్రిక్స్ భాగస్వామ్య దేశాలైన రష్యా, చైనాలతో పటిష్ఠ వాణిజ్య బంధాలను ఏర్పరచుకుంటే అమెరికా ఏకపక్షంగా విధిస్తున్న సుంకాల బెడదను తప్పించుకోవచ్చు. అయితే ఇదంత సులభమేమీ కాదు. ముఖ్యంగా భారత్ పట్ల చైనా నిలకడలేని వైఖరి ప్రదర్శిస్తోంది. భారత్ ఆర్థికంగా బలోపేతం కావడం చైనాకు ఇష్టం లేదన్నది బహిరంగ రహస్యమే. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం లభించకుండా వీటో హక్కు గల చైనా ఎప్పటినుంచో అడ్డుకుంటోంది. భద్రతా మండలిలో సంస్కరణలు అత్యవసరమన్న భారత్ వాదనకు చైనా ఏ మాత్రం మద్దతు ఇవ్వడం లేదు. అంతర్జాతీయ వ్యవస్థను సమానత్వం వైపు నడిపించాలని బ్రిక్స్ సదస్సులో చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ పిలుపునిచ్చారు! ఇది, భారత్‌కు వ్యతిరేకంగా చైనా అనుసరిస్తున్న ద్వంద్వ నీతికి నిదర్శనం. 193 దేశాలకు సభ్యత్వమున్న వ్యవస్థగా ఐక్యరాజ్యసమితి ఉన్నప్పటికీ దానికి అనుబంధంగా ఉన్న భద్రతామండలిలో కేవలం ఐదు దేశాలకు మాత్రమే వీటో హక్కుతో కూడిన శాశ్వత సభ్యత్వం ఉంది. దీంతో భద్రతా మండలిలో ముఖ్యంగా ఆ రెండు దేశాల పెత్తనం నడుస్తోంది. ఆశ్చర్యం ఏమిటంటే, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాల నుంచి ఒక్క దేశానికి కూడా భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం లేదు. ఈ ఖండాల దేశాలకూ మండలిలో సముచిత రీతిలో ప్రాతినిధ్యం ఉండాలని భారత్ సహా పలు దేశాలు పదేపదే చేస్తున్న విజ్ఞప్తులు కంఠశోషగానే మిగిలిపోతున్నాయి. భద్రతామండలిలో ఎక్కువ దేశాలకు శాశ్వత ప్రాతినిధ్యం కల్పిస్తే నిర్ణయాలు తీసుకోవడంలో తీవ్ర జాప్యం జరుగుతుందనే సాకుతో అటువంటి ప్రతిపాదనలను బుట్ట దాఖలు చేస్తున్నారు. ముఖ్యంగా ఏకపక్ష సుంకాల విధింపునకు ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలను తోసిరాజని సొంత నిర్ణయాలను కొన్ని దేశాలు అమలు చేస్తున్నాయని అమెరికా పేరును నేరుగా ప్రస్తావించకుండానే ప్రధాని మోదీ బ్రిక్స్ సదస్సులో తప్పు పట్టడం గమనార్హం. ఐక్యరాజ్యసమితిలో ప్రతి ఒక్కరికి సమాన భాగస్వామ్యం ఉండాలి. భద్రతా మండలి విస్తరణ వాయిదా పడకూడదని మోదీ విస్పష్టంగా చెప్పారు. భారత్ ప్రతిపాదనలను అమలు పరచడానికి 10 సూత్రాలతో ఒక మార్గదర్శక ప్రణాళికను వచ్చే బ్రిక్స్ సమావేశాల నాటికి ఉమ్మడిగా రూపొందించాలని కూడా ఆయన దిశానిర్దేశం చేశారు. బ్రిక్స్ వేదికపై భారత ప్రధానమంత్రి ఇంత స్పష్టంగా అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులు, ప్రయోజనాల గురించి మాట్లాడటం బహుశా ఇదే ప్రథమం. ఇది అంతర్జాతీయ సంబంధాల విషయంలో భారత్ వేసిన ఓ గొప్ప ముందడుగు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిదాయకం

### భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం ఆమె పోరాటం చిరస్మరణీయం

రంగారెడ్డి, సెప్టెంబర్ 26: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ 131వ జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆమె పోరాట స్ఫూర్తితో తెలంగాణ సాయుధ రైతాంగ ఉద్యమం బలోపేతమైందని, తద్వారా లక్షలాది ఎకరాల భూమి పేద ప్రజలకు పంపిణీ అయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ వంటి మహనీయుల సేవలు, త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తోందన్నారు.




**హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరవనిత**

తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ జి. మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ.. 1895లో జన్మించి 1985లో మరణించిన వీరనారి చాకలి ఐలమ్మ తన జీవితంలో అనేక కష్టాలు, అణచివేతలను ఎదుర్కొని ప్రజల కోసం పోరాడారని తెలిపారు. పాలకుర్తి ప్రాంతంలో కౌలుకు భూమి తీసుకుని వ్యవసాయం చేస్తూ, తన పంటను దోపిడీ చేసేందుకు ప్రయత్నించిన దొరల ఎదుట ధైర్యంగా నిలబడి హక్కుల కోసం పోరాడిన వీరవనితగా ఐలమ్మ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మాత్రమే కాకుండా, నేటి తరానికి దిక్సూచిగా నిలిచిన స్ఫూర్తిదాత అని కొనియాడారు. ఆమె పోరాట స్ఫూర్తితో యువత తప్పుడు మార్గాలకు దూరంగా ఉండి సామాజిక చైతన్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాన ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహిస్తూ సామాజిక అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి శివ ఆశిష్ సింగ్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేసు రామ్, రజక సంఘం నాయకులు అజయ్, దశరథ్, శ్రీరాములు, వడ్డెర సంఘం నాయకులు వరికుప్పల సుధాకర్, బీసీ సంక్షేమ వసతి గృహాల అధికారులు, బీసీ సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బండ ఆంజనేయులు, బీసీ సంఘం నాయకులు అచ్చన నరసింహ, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి - జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రవి రాథోడ్

మహబూబాబాద్ జిల్లా: (సెప్టెంబర్ 26వేకువ సమయం ప్రతినిధి) : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుంజేడు గ్రామంలో సిరబోయిన విక్రాంత్, తండ్రి శ్రీధర్ తేది:21-09-2026న డెంగ్యూ పాజిటివ్గా నిర్ధారణ అయిన నేపథ్యంలో, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ శనివారం బాధితుని నివాసాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ వరుణ్ తేజ్ మరియు వైద్య సిబ్బందితో కలిసి బాధితుని ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఇంటి చుట్టుపక్కల నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వా పెరుగుదలను గుర్తించి, వాటిని తొలగించే చర్యలు చేపట్టారు. అలాగే ఇంటిలో మరియు పరిసర ప్రాంతాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. చుట్టుపక్కల ఉన్న ఇళ్లలో కూడా దోమల నివారణ మందును స్ప్రే చేయించారు. ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా మరియు సామూహికంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్తగూడ మండలంలోని ప్రతి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి, జ్వరం ఉన్నవారిని గుర్తించి అవసరమైన పరీక్షలు మరియు వైద్య సేవలు అందించాలని మండల వైద్యాధికారి డాక్టర్ వరుణ్ తేజ్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు డెంగ్యూ, మలేరియా మరియు ఇతర సీజనల్ జ్వరాల నివారణలో భాగంగా తమ పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి, జ్వర బాధితులను గుర్తించి, అవసరమైన పరీక్షలు మరియు చికిత్స అందించాలని ఆదేశించారు. ప్రజలు పరిసరాలను



పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, ఇళ్లలో చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, జ్వరం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రవి రాథోడ్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి, వైద్య సిబ్బంది ఇతర ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆత్మగౌరవ పోరాటానికి ప్రతీక చాకలి ఐలమ్మ : మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



షాద్నగర్ : కేశంపేట మండలం నిర్దవెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఘనంగా ఆవిష్కరించారు. గ్రామ రజక సంఘం విజ్ఞప్తి మేరకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, గ్రామ ప్రజలు, రజక సంఘం నాయకులు, మండల, గ్రామ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలతో పోరాడిన చాకలి ఐలమ్మ ప్రజల హక్కుల కోసం నిలబడిన స్ఫూర్తిదాయక మహిళ అని కొనియాడారు. ఆమె త్యాగాలు, పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామ రజక సంఘం విజ్ఞప్తిని గౌరవించి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు సహకరించిన రవీందర్ యాదవ్‌ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. గ్రామంలో ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయడం ఆమె పోరాట చరిత్రకు గుర్తుగా నిలుస్తుందని, యువతకు స్ఫూర్తినిస్తుందని తెలిపారు. చాకలి ఐలమ్మ ఆశయాలు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ఆమె చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సి ఎస్టీ కమీషన్ సభ్యులు రాంబాల్ నాయక్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు లక్ష్మీనారాయణ గౌడ్, విశ్వనాథం, మాజీ జడ్పీటీసీ నర్సింగరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవేందర్ యాదవ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్ గౌడ్, తదితరులు, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రజక సంఘం నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నాగారం అభివృద్ధికి వేగం పెంచాలి

### మౌలిక వసతుల సమస్యలపై కమిషనర్‌తో తోటకూర వజ్రేష్ యాదవ్ చర్చ



వేకువ సమయం సెప్టెంబర్ 26 కీసర ప్రతినిధి : కీసర : నాగారం డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి పనులకు వేగం పెంచాలని డీసీసీ అధ్యక్షుడు, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ కోరారు. కౌకుంట్ల జీవన్ రెడ్డితో కలిసి మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ఐఏఎస్‌ను కలిసి డివిజన్‌లో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా నాగారం డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా అధ్వానంగా ఉన్న రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, పారిశుధ్య నిర్వహణను పటిష్టం చేయడం, ప్రజలకు అవసరమైన ఇతర మౌలిక వసతులను కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. వర్షాకాలంలో డ్రైనేజీ సమస్యలు, రహదారుల పరిస్థితి కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని, ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించిన సమస్యలు, చేపట్టాల్సిన పనుల వివరాలతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్‌కు అందజేశారు. నాగారం డివిజన్ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత విభాగాల అధికారులతో సమన్వయం చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు వజ్రేష్ యాదవ్ తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందేలా అభివృద్ధి పనులపై నిరంతరం దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.

## అమరచింతలో స్ట్రీట్ వెండార్లకు క్రెడిట్ కార్డుల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు...

అమరచింత : వనపర్తి జిల్లా అమరచింత మున్సిపాలిటీలో PM SVANidhi ఆత్మనిర్భర్ పథకం కింద మొత్తం 905 మంది స్ట్రీట్ వెండార్లు ఉన్నారు. వీరిలో 510 మంది 15 వేల మొదటి రుణం, 263 మంది 25 వేల రెండో రుణం, 132 మంది 50 వేల మూడో రుణం పొందారు. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించిన అర్హులైన చిరు వ్యాపారులకు క్రెడిట్ కార్డు సదుపాయం కల్పించేందుకు అమరచింత మున్సిపల్ కార్యాలయంలో ఈరోజు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించారు. మున్సిపాలిటీ కమిషనర్ ఆదేశాల మేరకు యత్న యువరాజ్ ఆధ్వర్యంలో కంప్యూటర్ ఆపరేటర్లు అభి, భరత్, కోఆర్డినేటర్ యువరాజ్.. ఆర్‌పీలు, సంగీత, ఖాజా నాగమణి, సాదిక్, సరళ, శశికళ, పద్మాబాయి, కమల, రాజేశ్వరి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సీఈసీపై పోరుకు ఇండియా కూటమి సిద్ధం.. సెప్టెంబర్ 30న కీలక సమావేశం

మొదటి పేజీ తరువాయి

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోసం ఒత్తిడి పెంచేందుకు ఇండియా కూటమిలోని పార్టీలు సమాయత్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 30వ తేదీన ఆ పార్టీల అగ్రనేతలు సమావేశం కానున్నారు. దేశ రాజధాని న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ వేదికగా ఇండియా కూటమి నేతలు భేటీ కానున్నారు. ఈ సమావేశానికి ఆయా పార్టీల అగ్రనేతలు ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంక, ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, శివసేన యూబీటీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, సీపీఎం జనరల్ సెక్రటరీ ఎంఏ బేబీ తదితరులు హాజరవుతారని తెలుస్తోంది. ఈ సమావేశంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోసం అనుసరించాల్సిన వ్యూహంపై వారంతా చర్చించనున్నారు. ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలపై స్వతంత్ర విచారణ, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాతోపాటు అందుకోసం దేశవ్యాప్తంగా చేపట్టాల్సిన నిరసనలు, ఆందోళనలకు రోడ్డు మ్యాప్‌పై వారంతా చర్చించనున్నారు. మరికొద్ది నెలల్లో పంజాబ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని కూటమిలోని నేతలు అడుగులు వేస్తున్నారు. ఇక ఈ భేటీపై ఇప్పటికే టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీతోపాటు సీపీఎం జనరల్ సెక్రటరీ ఎంఏ బేబీతో ఎంపీ రాహుల్ గాంధీ ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం. భారత ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ (SIR) ప్రక్రియ చేపట్టింది. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘంలోని ముగ్గురు కమిషనర్లలో ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో మిగిలిన ఇద్దరు కమిషనర్లు సుఖబీర్ సింగ్ సందు, వివేక్ జోషిలు తీవ్రంగా వ్యతిరేకించినట్లు ఆంగ్ల మీడియాలో ఓ కథనం ఇటీవల ప్రచురితమైంది. ఇద్దరు కమిషనర్ల ప్రమేయం లేకుండా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారంటూ ఆ కథనంలో పేర్కొంది. ఈ కథనంపై దేశంలోని రాజకీయ పార్టీల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇక కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చీఫ్ అభిజిత్ దిప్కే.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అందుకు గడువు కూడా విధించారు. సీఈసీ రాజీనామా చేయకుంటే.. దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని సీజేపీ చీఫ్ అల్టిమేటం జారీ చేశారు.





# గొర్రెల పెంపకందారుల సంక్షేమానికి సమగ్ర చర్యలు-మంత్రి వాకిటి శ్రీహరి

కరీంనగర్ : సెప్టెంబర్ 26: గొర్రెలు, మేకల పెంపకంపై ఆధారపడిన కుటుంబాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు & క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గొర్రెలు, మేకల పెంపకందారుల కార్యవర్గ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. కులవృత్తులను కాపాడుకోవడంతో పాటు వాటిని ఆధునిక పద్ధతులతో లాభదాయకమైన వ్యాపారాలుగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. "గొర్రెల కాపరి కుటుంబంలో పుట్టిన బిడ్డ గొర్రెలు కాయడంతోనే ఆగిపోవాల్సిన అవసరం లేదు.. ఉన్నత చదువులు చదివి అమెరికా వెళ్లే స్థాయికి ఎదగాలి" అని మంత్రి అన్నారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను తప్పకుండా చదివించాలని పిలుపునిచ్చారు.

**పాల్గొన్న మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, ఏమ్మెల్యే మేడిపల్లి సత్యం కార్పొరేషన్ల చైర్మన్లు సరితాతిరుపతి యాదవ్, చరణ్ కౌశిక్ యాదవ్, బొర్ర జ్ఞానేశ్వర్**

**గొర్రెలకు బీమా.. పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలి -మంత్రి వాకిటి శ్రీహరి**

**కులవృత్తిని కాపాడుకుంటూనే ఆధునిక వ్యాపారంగా అభివృద్ధి చేయాలి: మంత్రి వాకిటి శ్రీహరి**

### గొర్రెలకు బీమా తప్పనిసరి

గొర్రెల పెంపకందారులు తమ గొర్రెలకు బీమా చేయించుకోవాలని మంత్రి సూచించారు. మేత కోసం గొర్రెలను వందల కిలోమీటర్ల దూరం తరలించే సమయంలో రోడ్డు ప్రమాదాలు, ఇతర కారణాలతో నష్టం జరుగుతోందని తెలిపారు. ఇలాంటి సందర్భాల్లో కుటుంబాలు ఆర్థికంగా నష్టపోకుండా బీమా రక్షణ కల్పించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బీమా ప్రీమియం పెద్ద భారం కాదని, చిన్న మొత్తంతోనే గొర్రెలకు రక్షణ కల్పించుకోవచ్చని చెప్పారు. గొర్రెల పెంపకందారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### గత పథకాలపై సమీక్ష.. కొత్త విధానాలకు రూపకల్పన

గతంలో అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకాల అనుభవాలను సమీక్షించి, ఇకపై లబ్ధిదారులకు వాస్తవమైన ఆర్థిక ప్రయోజనం కలిగేలా పథకాలను రూపొందించాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. కేవలం గొర్రెల పంపిణీకే పరిమితం కాకుండా గొర్రెల పెంపకం, పశువైద్యం, బీమా, మేత, మార్కెటింగ్, మాంసం విక్రయం, ప్రాసెసింగ్ వంటి అన్ని అంశాలను అనుసంధానం చేస్తూ సమగ్ర విధానం అవసరమన్నారు.

### మన గొర్రెలకు మనమే మార్కెట్ సృష్టించాలి

హైదరాబాద్‌కు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో గొర్రెలు వస్తున్నాయని మంత్రి తెలిపారు. మన రాష్ట్రంలో గొర్రెల పెంపకం విస్తృతంగా ఉన్నప్పటికీ, ఉత్పత్తికి సరైన మార్కెట్ వ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. "మన గొర్రెలు ఎందుకు ఇతర రాష్ట్రాల మార్కెట్లకు వెళ్లాలి మన గొర్రెల పెంపకందారుడే ఎందుకు ఎక్కువ లాభం పొందకూడదు?" అని మంత్రి ప్రశ్నించారు. గొర్రెల పెంపకాన్ని కేవలం కులవృత్తిగా కాకుండా ఆధునిక వ్యాపార రంగంగా అభివృద్ధి చేసి, పెంపకందారులకు మెరుగైన ఆదాయం అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

### రుణభారం సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

గొర్రెల పెంపకందారులు సమావేశంలో ప్రస్తావించిన రుణభారం,



ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి హామీ ఇచ్చారు. అవసరమైతే సంఘాల ప్రతినిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. "మీరు నాపై నమ్మకం పెట్టుకోండి. శాఖ మంత్రిగా మీకు అవసరమైన సదుపాయాలు, సంక్షేమ చర్యలు, భవిష్యత్ అవసరాలపై పూర్తి స్థాయిలో కృషి చేస్తాను" అని మంత్రి హామీ ఇచ్చారు. కులవృత్తులను కాపాడుకుంటూనే విద్య, ఆధునిక సాంకేతికత, మార్కెటింగ్, బీమా వంటి అంశాలపై దృష్టి సారించాలని మంత్రి పిలుపునిచ్చారు. "మన కులవృత్తి మన బలం.. మన గొర్రెలు మన ఆస్తి.. మన పిల్లల చదువు మన భవిష్యత్తు" అని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.

# రూ.25 లక్షలతో చంద్రఘడ్ కోట అభివృద్ధికి మంత్రి శ్రీకారం



అమరచింత : బీద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల పెన్నిధి, తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశానుసారంగా TG టాడీ టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ విచేసి అమరచింత మండలం చంద్రగట్టుకోట రూ. 25 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి పనులకు శ్రీకారం చుట్టడం జరిగింది. చంద్రగట్టుకోటలో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ ఈ నిధులను మంజూరు చేయడం జరిగింది. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేయనున్నట్లు నాయకులు తెలిపారుమక్తల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి నిరంతరం కృషి చేస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండలం, ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందేలా ప్రత్యేక దృష్టి సారిస్తూ నిధులు సమకూర్చి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అమరచింత మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుంటూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా నాయకులు పేర్కొన్నారు. చంద్రగట్టుకోట అభివృద్ధికి రూ. 25 లక్షల నిధులు కేటాయించడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి కి, కేశం నాగరాజు గౌడ్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో DCC వనపర్తి జిల్లా కార్యదర్శి రమేష్ ముదిరాజ్, అమరచింత కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు టి రవికాంత్, అమరచింత మున్సిపాలిటీ చైర్ పర్సన్ జింక సువర్ణ రవి యాదవ్ ,చంద్రఘాట్ గ్రామ సర్పంచ్ శశికళ కుర్మారెడ్డి ,ఎ ప్రభాకర్ రెడ్డి, సూరు నల్లారెడ్డి ,+, చిన్న శేఖర్ అయ్యా , అర్జున్ బి శివ రెడ్డి , లంబూ వెంకటన్న , k. బాల్లప్ప, కురువ కత్తలప్ప , కురువ నాగరాజ్ , ఈడిగి శ్రీనివాస్ గౌడ్, p రంగారెడ్డి ,G. రవీందర్ రెడ్డి , చింత రెడ్డి పల్లె వెంకట్ రెడ్డి,మస్తిపురం సత్యన , ముని , కురుమన్న , సింగంపేట నర్సింహులు గౌడ్ , ఆనంద్ , రఫీ , లుతర్ , చినకడ్మూర్ జగన్ రెడ్డి సర్పంచ్ శివ నర్సింహులు గౌడ్ మొహమ్మద్ నందిమల x రోడ్డు విజయ్ భారతి రాము ఆంజనేయులు కృష్ణవర్ధన్ మనోహర్ నందిమల G శ్రీనివాస్ రెడ్డి రాము కృష్ణం పల్లి సుదర్శన్ ఈర్లదిన ఎ. శ్రీను, వెంకట్ రెడ్డి , ధర్మపూర్ గ్రామ సర్పంచ్ సావిత్రమ్మ శ్రీనివాస్ ,శివ ,మోహన్ రెడ్డి , మిట్ల నందిమల సర్వ రెడ్డి, ఆనంద్ , అశోక్ , వివిధ గ్రామాల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బిజ్వారంలో ఘనంగా చాకలి ఐలమ్మ గారి 131 జయంతి వేడుకలు



సమయం ప్రతినిధి: గద్వాల జిల్లా జోగులాంబ గద్వాల జిల్లా శనివారం మల్దకల్ మండలం బిజ్వారం గ్రామంలో ఐలమ్మ రజక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఐలమ్మ 131 జయంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీపీలు వై.సత్యారెడ్డి,వై.రాజారెడ్డి హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి చాకలి ఐలమ్మ 131వ జయంతోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు వై.సత్యారెడ్డి,వై. రాజారెడ్డి,దళిత జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. తిరుమలేష్ మాట్లాడుతూ... భూమికోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ ప్రజల తెగువను పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పు కనిక చాకలి ఐలమ్మ అని అన్నారు. ప్రతి ఒక్కరు చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారిని శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ చాపకండ్ల కర్రెన్న,వార్డ్ మెంబర్ బి. హరిన్ కుమార్,గ్రామ ఐలమ్మ రజక కమిటీ సంఘం అధ్యక్షుడు సి. నర్సింహులు,ఉపాధ్యక్షుడు అమరేష్,సలహాదారుడు సిద్దు, బీసన్న,కృష్ణ,వీరేష్, వెంకట్రాములు, లక్ష్మన్న, మాజీ ఉపసర్పంచ్ వెంకటేష్,చిన్న ఆశన్న,మండల సింగిల్ విండో మాజీ డైరెక్టర్ రంగన్న,గ్రామ భీమేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గోపాల కృష్ణ,సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



నల్గొండ :వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా తెలంగాణ శాసనసభ సెంట్రల్ హాల్‌లో ఆమె చిత్రపటానికి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు రాజ్ ఠాకూర్, బాలు నాయక్, నవీన్ యాదవ్, మురళీ నాయక్, కోవా లక్ష్మీ, ప్రభాకర్, ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, ఎల్. రమణ, తెలంగాణ శాసన మండలి సెక్రటరీ డా. నరసింహాచార్యులు, శాసనసభ సెక్రటరీ ఆర్. తిరుపతి తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ, వీరనారి చాకలి ఐలమ్మ తెలంగాణ పోరాట చరిత్రలో చెరగని ముద్ర వేసిన ధీరవనిత అని అన్నారు. భూమి, హక్కులు, ఆత్మగౌరవం కోసం నాటి భూస్వామ్య, పెత్తందారీ వ్యవస్థకు ఎదురొడ్డి ఆమె ప్రదర్శించిన ధైర్యసాహసాలు అసమానమైనవని పేర్కొన్నారు. సామాన్య కుటుంబంలో జన్మించినప్పటికీ అన్యాయాన్ని ప్రశ్నించి, అణచివేతకు ఎదురొడ్డి నిలబడిన చాకలి ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె పోషించిన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. తన హక్కుల కోసం మాత్రమే కాకుండా పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం ఎంతోమందిలో చైతన్యాన్ని నింపిందని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. మహిళా శక్తికి, ఆత్మగౌరవానికి, పోరాట పటిమకు ఆమె ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ వంటి తెలంగాణ పోరాట యోధుల చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా యువత ఆమె జీవితాన్ని, పోరాటాన్ని తెలుసుకొని సమాజంలో అన్యాయం, అసమానతలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ ఆశయాలు, ఆమె పోరాట స్ఫూర్తి తెలంగాణ సమాజానికి ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తాయని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు.

# ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం ఘనంగా చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు

**విగ్రహానికి నివాళులర్పించిన ప్రభుత్వ విప్**



మహబూబ్ నగర్ : తెలంగాణ సాయుధ పోరాటంలో భూస్వామ్య గడీల అహంకారాన్ని ఎదిరించి నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి నిరంతర ఆదర్శమని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్ ప్రాంగణంలో చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం గళమెత్తి నిజాం నిరంకుశ పాలనపై దండెత్తిన ధీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. హక్కుల సాధనలో ఆమె ప్రదర్శించిన తెగువ, పోరాట పటిమ యువతకు ఎల్లప్పుడూ దిక్సూచిగా నిలుస్తుందన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన ఐలమ్మ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, శ్రీనివాస్ యాదవ్, మైత్రి యాదయ్య, రమేష్ యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పసుల రాజు, కార్పొరేటర్లు ప్రవీణ్ కుమార్, రమేష్ రెడ్డి, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు పార్టీ ప్రజా సంఘాల ప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ ద్వారా మరిన్ని సేవలు అందించాలి: ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (మహబూబ్‌నగర్ శాఖ) చైర్మన్ మరియు సభ్యులను అభినందించిన ప్రభుత్వ విప్**

మహబూబ్ నగర్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబ్‌నగర్ జిల్లా శాఖ నూతన చైర్మన్‌గా కేఎస్ రవికుమార్ చైర్మన్‌గా, ఉపాధ్యక్షులుగా రామకృష్ణయ్య, కోశాధికారిగా జి.రమణయ్య, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నిలి నూతన చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారి తో పాటు సభ్యులు బాబు చింతలపల్లి (సి. బాబుల్ రెడ్డి), బొండిగ విష్ణు జనార్దన్ , చిగుళ్లపల్లి, లక్ష్మీనారాయణ, దేవిక బాదిమి, ధర్మరాజు ఎస్., జి. శామ్యూల్, జక్కని తిరుపతి రెడ్డి, మగంతల జయ రాములు, పుట్టపాగ రఘుపతి, రవి కుమార్ యాదవ్ వై., సురభి జగపతి రావు, వి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే వారికి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అంతర్జాతీయ సేవా సంస్థ అయిన రెడ్‌క్రాస్ ద్వారా జిల్లా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా పాలకవర్గం కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు బాధితులకు తక్షణమే అండగా నిలవాలని సూచించారు. సమాజంలో ప్రాణదాతలుగా నిలిచే రక్తదాన శిబిరాలు, ఉచిత ఆరోగ్య సేవలు, ఇతర సామాజిక సేవా కార్యక్రమాలను గ్రామీణ స్థాయి వరకు మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ పర్యటక దినోత్సవం, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్






మహబూబాబాద్ జిల్లా; (సెప్టెంబర్ 26వేకువ సమయం ప్రతినిధి) : అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ మండలం, కంబాలపల్లి పెద్ద చెరువు వద్ద జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ గారికి గ్రామ ప్రజలు కోలాటం, చిరుతల రామాయణం, బతుకమ్మలు, బోనాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఘనంగా స్వాగతం పలికారు. పురాతన శివాలయంను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.చెరువు ప్రాంగణంలో మొక్క నాటి నీరు పోశారు, జిల్లాలోని పర్యటక ప్రదేశాలపై పాఠశాల విద్యార్థులు వేసిన పెయింటింగ్, ఫోటో ఎగ్జిబిషన్ ను సందర్శించారు.అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోనీ కురవి వీరభద్ర స్వామి ఆలయం, కందికొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, వెంకటేశ్వర ఆలయం నరసింహులపేట, బయ్యారం పెద్ద చెరువు, మత్తడి, అనంతరం, భీముని పాదం, గుంజేడు ముసలమ్మ తల్లి ఆలయం, పురాతనమైన ఆలయాలు ఏడు బావులు, కంబాలపల్లి పెద్ద చెరువు, గ్రీన్ హిల్స్ క్యాంపింగ్, పులిమడుగు క్యాంపింగ్, బయ్యారం జలపాతం, పర్యటక ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్య చర్యలతో ముందుకు సాగుతున్నామని, జిల్లాలోని పర్యటక ప్రదేశాలను విస్తృత ప్రచారం గావించుటకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా ఇన్ఫ్లెన్సర్స్ , జిల్లాకు చెందిన సినీ ప్రముఖులు, టీచర్స్, కవులు, రచయితలు, ప్రజా ప్రతినిధులు,యూట్యూబర్స్, జిల్లాలోని ప్రజలు ప్రముఖులు, విద్యార్థినీ, విద్యార్థులు ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాలని పర్యటక ప్రదేశాల ద్వారా గ్రామాలు జిల్లా అభివృద్ధి చెందుతుందని, జిల్లాలో 49 శాతం అడవి ఉందని అందులో ఎంతో అద్భుతమైన టూరిజం స్పాట్స్ ఉన్నాయని, కల్చర్, టెంపుల్ , ఎకో, అన్ని రకాల టూరిజం మన జిల్లాలో కలదని, ప్రతి ఒక్కరూ ఆ విషయాలపై ప్రమోట్ చేయాలన్నారు, కల్చర్ పై క్లుప్తంగా బుక్కు రాసిన రమేష్ గారిని అభినందించారు. పర్యాటక ప్రాంతాలలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్లాస్టిక్ రహిత ప్రదేశాలుగా తీర్చిదిద్దుటకు ప్రతి ఒక్కరూ బాధ్యత యుతంగా కృషి చేయాలని సూచించారు, పర్యటక రంగం అభివృద్ధి చెందుతే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని తద్వారా జిల్లా ఆర్థికంగా స్థిరంగా ఉంటుందన్నారు, ప్రపంచంలోని కొన్ని దేశాలు, మనదేశంలోని నార్త్ ఈస్ట్ లలో గోవా, మేఘాలయ, అస్సాం, తదితర ప్రదేశాలు కేవలం టూరిజం పై ఆధారపడి ఉంటుందని అక్కడి స్థానిక ప్రజలు పర్యటక ప్రాంతాలను, ఓన్ చేసుకుని అటవీ ప్రాంతాలను కఠిన నిబంధనలతో సంరక్షించుకుంటూరన్నారు, ఏ విధంగా అయినా ప్రకృతికి విగాథం కలిగించకుండా నిబంధనలు పెట్టుకుంటారన్నారు, అదే స్ఫూర్తితో మన జిల్లాలో కూడా సర్పంచులు, ఫారెస్ట్ అధికారులు, టూరిజం నోడల్ అధికారి, బాధ్యతా యుతమైన టూరిజంను పెంపొందించడం కోసం కృషి చేయాలన్నారు. పాఠశాలలలో యువ టూరిజం క్లబ్బులను ఏర్పాటు చేయడం జరిగింది అందులో చర్చించుకుని జిల్లాలోని టూరిజం ప్రదేశాలను ప్రమోట్ చేయాలన్నారు, జిల్లాలో ఉన్న పర్యటక ప్రదేశాలను పూర్తిగా స్వేచ్ఛాయుత వాతావరణంలో సందర్శించాలని కానీ తగిన నిబంధనలు పాటిస్తూ సొంత వస్తువులను తీసుకువెళ్లాలని ప్లాస్టిక్స్ నివారణ కచ్చితంగా పాటించాలని, పిల్లలు మీరు అలవాటు చేసుకుని ఇతరులకు చెప్పాలని సూచించారు.ఇంత పెద్ద కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విజయవంతం చేసిన టూరిజం నోడల్ అధికారి శ్రీమన్నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ఇన్చార్జి లోకల్ బాడీ పురుషోత్తం, ఫారెస్ట్ డివిజనల్ అధికారి వెంకటేశ్వర్లను, స్థానిక గ్రామ సర్పంచ్, ప్రజలను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయుటలో కీలక భూమిక పోషించిన తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యులను, స్థానిక గ్రామ కళాకారులను, విద్యార్థినీ, విద్యార్థులను, సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన వివిధ పాఠశాలల పిల్లలను గ్రామ కళాకారులను, శాలువా మెమొంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ గుగులోతు జ్యోతి, మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్, జిల్లా అధికారులు, స్థానిక సర్పంచ్ చిరకా వసంత –ఉపేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ కమటం యాకన్న, గ్రామ ప్రజలు ప్రజలు కె.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి అభిలాష్, తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి: జిల్లా రెవెన్యు అధికారి టి, ఏ, వి, నాగలక్ష్మి



మహబూబాబాద్ జిల్లా; (సెప్టెంబర్ 26 వేకువ సమయం ప్రతినిధి);తెలంగాణ ప్రభుత్వం కమిషనర్ బి.సి వెల్ఫేర్ ఇచ్చిన సూచనలు మేరకు జిల్లా కలెక్టర్, మహబూబాబాద్ అనుమతితో శనివారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యు అధికారి టి ఏ వి, నాగలక్ష్మి ముఖ్య అతిదిగా పాల్గొని వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటంకు పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ, ,,తెలంగాణ లో చాకలి ఐలమ్మ చేసిన త్యాగాలు చిరస్మరణీయమని, ఆమే చూపిన ధైర్య సాహసాలను స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని, చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమములో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సిహెచ్,సాయి శ్రీజ వసతి గృహ సంక్షేమ అధికారులు,జిల్లా అధికారులు, ఐ డి ఓ సి, కార్యాలయ సిబ్బంది జిల్లాలోని రజక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ ఆత్మగౌరవానికి ప్రతీక: ఝాన్సీరాణి



వేకువ సమయం సెప్టెంబర్ 26 కీసర ప్రతినిధి : అంతాయపల్లి: వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శనివారం అంతాయపల్లిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి జ్యోతి ప్రజ్వలన చేసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ అభివృద్ధి అధికారి టి. ఝాన్సీరాణి మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. సామాజిక అన్యాయం, దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా ఆమె ధైర్యంగా పోరాడారని తెలిపారు. ఐలమ్మ జీవితం ధైర్యం, ఆత్మవిశ్వాసం, సామాజిక న్యాయం, సమానత్వం వంటి విలువలకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. విజయేందర్ రెడ్డి, డీఆర్వో ఎస్. మాలతి, ఎస్సీ అభివృద్ధి అధికారి జి. వినోద్ కుమార్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి కేవీవీ సీతారాం, ఏబీసీడీవో గంగాధర్, రజక సంఘం నాయకులు పంజా అంజయ్య, సాంబరాజ్ కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మకు ఘన నివాళులు

నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 26 : నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు వీర వనిత చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్ IPS గారు చాకలి ఐలమ్మ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... తెలంగాణ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, అన్యాయంపై ఆమె సాగించిన పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.ఈ భూమినాది... పండించిన పంటనాది... తీసుకెళ్లడానికి దొరెవ్వడు... నా ప్రాణం పోయాకే ఈ పంట, భూమి మీరు దక్కించుకోగలరు.. అంటూ మాటల్ని తూటాలుగా మల్చుకొని దొరల గుండెల్లో బడబాగ్నిలా రగిలిన తెలంగాణ రటైతాంగ విప్లవాగ్ని చాకలి అయిలమ్మ. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, పోలీస్ కార్యాలయ ఏవో కృష్ణయ్య, ఆర్ఐ జగన్, ఎస్ఐలు రమేష్, వెంకటేశ్వర్లు, ఆర్ఎస్ఐలు ప్రశాంత్, గౌస్ పాషా, శివాజీలతో పాటు జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వీరనారి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం





మహబూబ్ నగర్ :మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మహబూబ్ నగర్ పురపాలిక పరిధిలోని పాలకొండలో ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.దొరలకు..భూస్వాములకు వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటం చేసారు.. పేదలకు భూములు ఇవ్వాలని..వాళ్ళు వ్యవసాయం చేయాలనీ రోకలి బండతో ఐలమ్మ పోరాటం సాగించారు.ఐలమ్మ అన్ని వర్గాల గురించి పోరాటం చేసింది..మహనీయులు అందరు పేదల కోసం పోరాటం చేసారు. ఒక వర్గానికి..కులానికి వీళ్ళను పరిమితం చేయవద్దని ఐలమ్మ స్ఫూర్తితో మహిళలు ముందుకు వెళ్ళాలి. సామాన్య పేద రజక కుటుంబంలో పుట్టిన ఐలమ్మ చిన్నతనం నుంచే ఎన్నో కష్టాలను ఎదుర్కొని అన్యాయానికి తలవంచకుండా హక్కుల కోసం పోరాడారన్నారు. తెలంగాణ ప్రజలకు నూతన స్ఫూర్తిని, తెగువను అందించిందన్నారు. నాటి భూస్వాములను ఎదురించి ధిక్కార స్ఫూర్తినీ,. నాటి చట్టాల పరిధిలో న్యాయస్థానంలోనూ పోరాడి గెలిచి ప్రజాస్వామిక స్ఫూర్తినీ., ప్రదర్శించిన ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. చాకలి ఐలమ్మ గొప్పతనాన్ని భవిష్యత్తు తరాలకు చాటేందుకు నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం, వారి జయంతిని అధికారికంగా నిర్వహించే సాంప్రదాయాన్ని నెలకొల్పిందని అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రములో ఆమె విగ్రహంతో పాటు పలువురు మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పాలకొండ ను బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేసాము..మళ్లి అధికారంలోకి వస్తే స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు కంపెనీలు తీసుకువస్తామన్నారు. అనంతరం పద్మావతీ కాలనీలోని గ్రీన్ బెల్ట్ వద్ద ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ,పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, కార్పొరేటర్లు సరస్వతి, సీనియర్ నాయకులు కుర్వ శ్రీశైలం, నరేందర్ , క్రాంతి , శ్రీనివాస్ రెడ్డి, సురేందర్, ఆంజనేయులు, రవికిషన్ రెడ్డి, గిరిధర్ రెడ్డి, కోట్ల నర్సింహా , అహ్మదుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్నినో పరిస్తితులలో... పంట మార్పిడి ద్వారా కూరగాయల సాగు




మహబూబాబాద్ జిల్లా; (సెప్టెంబర్ 26 వేకువ సమయం ప్రతినిధి): నామాలపాడు గ్రామం , బయ్యారం మండలం/ మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ మేడం స్నేహ శబరిష్, ఆదేశాల ప్రకారం మిషన్ వైవిధ్యం కార్యక్రమం ద్వారా పంట మార్పిడి ప్రోత్సాహం: మన జిల్లా డిమాండ్ ప్రకారం పదివేల ఎకరాలలో కూరగాయలు సాగు చేయాల్సి వుంది. కానీ సాగు రెండు వేల ఎకరాలలో సాగు అవుతుంది. సాగు పెంచాలి – ఆర్థికంగా ఎదగాలని జిల్లా ఉద్యానవన మరియు పట్టు పరిశ్రామ శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు. కూరగాయల సాగుతో లక్షల రూపాయల ఆదాయం – గ్రామీణ యువతకు & స్వయం సహాయక సంఘాలకు స్వయం ఉపాధి – ప్రభుత్వం ద్వారా పలు రాయితీలు. తేదీ. 26.09.2026 శనివారం రోజున బయ్యారం మండలం, నామాలపాడు గ్రామంలో వాంకుడోతు దోసిలాల్ సాగు చేస్తున్న కూరగాయల క్షేత్రాన్ని సందర్శించి పలు మేలైన యాజమాన్య పద్ధతులు తెలియజేయడం జరిగింది. కాకర సాగుని తాత్కాలిక పందిరి పై సాగు చేస్తూ ఎకరానికి వానాకాలం & యాసంగీ సీజన్ లలో 2 లక్షలకు పైగా ఆదాయాన్ని పొందుతున్నారు. ఈ రైతు వరి, మొక్క జొన్న, పత్తి, మిరప పంటలకు ప్రత్యామ్నాయంగా కాకర, చిక్కుడు సాగు చేస్తున్నారు. బయ్యారం మండలం లోని రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కూరగాయల సాగులో ఎత్తు మడులు, పందిరి సాగు, సేంద్రీయ పద్ధతులు, పంట కుంట వంటి మేలైన పద్ధతులు పాటిస్తూ సాగు చేస్తున్నారు. నిత్యం రోగనిరోధక శక్తికి, ఆరోగ్యంగా ఉండటానికి పోషకాలు అందించే టమాట, పచ్చి మిరప, వంగ, బెండ, బీర, సొర, కాకర, దొండ, పొట్ల, మునగ, చిక్కుడు, గోరు చిక్కుడు, దోస, క్యారెట్, బీట్ రూట్, ముల్లంగి, కాబేజీ, కాలీఫ్లవర్, ఆకు కూరలు, కంద, చేమ, ఉల్లి, తదితర కూరగాయలు సాగు చేయాలి. రోజువారి కూరగాయల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు, నూతన రకాల సాగు, ప్రోట్రేలో నారు పెంపకం, ఎత్తు మడులు, మల్చింగ్, బిందు సేద్యం, ఫర్టిగేషన్, వేప పిండి, ఆముదం పిండి వాడకం, వేప నూనె పిచికారి చేయటం, పసుపు రంగు అట్టల వాడకం, సిఫారసు చేసిన ఎరువులు వాడటం, పందిరిపై కూరగాయల సాగు, ట్రెల్లిస్ మెథడ్ లో టమాటా సాగు మొదలైన పద్ధతులు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన & పట్టు పరిశ్రమ అధికారి జినుగు మరియన్న, మండల వ్యవసాయ అధికారి కె.రాజు, బయ్యారం, రైతులు దోసిలాల్, వెంకటేష్ తదితరులతో పాటు, వ్యవసాయ విస్తరణ అధికారులు, పి. రమేష్, జి.నాగరాజు, బి. రెడ్యా, పి. అఖిల్, యం. డి. ఫయాజ్ పాల్గొన్నారు.

# సత్వరం సమస్యలు పరిష్కరిస్తా : ఎమ్మెల్యే

**టీజీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ ఉమెన్స్ కళాశాల విద్యార్థులతో మాట్లాడిన ప్రభుత్వ విప్ యెన్నం**



మహబూబ్‌నగర్ : నగరంలోని పిల్లలమర్రిలో ఉన్న టీజీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ ఉమెన్స్ కళాశాల విద్యార్థినుల సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి తెలిపారు. కళాశాల మైదానంలో విద్యార్థినులు సాయంత్రం క్రీడల సాధన చేస్తున్న సమయంలో అటువైపు పలు అభివృద్ధి కార్యక్రమాల పరిశీలనకు వెళ్తున్న ఎమ్మెల్యే కాసేపు అక్కడ ఆగి విద్యార్థినులతో మాట్లాడారు. వారి విద్య, క్రీడలకు సంబంధించిన సౌకర్యాలు, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమకు ఎదురవుతున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా క్రీడా మైదానంలో విద్యార్థినుల సౌకర్యార్థం హైమాస్ట్ విద్యుత్ దీపాలను సత్వరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. అదేవిధంగా విద్యార్థినుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కళాశాల పరిసర ప్రాంతాల్లో పోలీసు పెట్రోలింగ్‌ను పెంచే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థినులు క్రీడల్లోనూ, విద్యలోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో



మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, కె.శేఖర్ నాయక్, మైత్రి యాదయ్య, కార్పొరేటర్లు దేప్లీ మేఘ్యానాయక్ , ఫయాస్ తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజుల హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలి






**పిల్లలకు నాణ్యమైన విద్య అందించి ప్రపంచ స్థాయిలో రాణించేలా చేయాలి-మంత్రి వాకిటి శ్రీహరి**
**ముదిరాజుల సంఖ్యాబలాన్ని సామాజిక, రాజకీయ బలంగా మార్చుకోవాలి: మంత్రి వాకిటి శ్రీహరి**
**బీసి డి నుంచి ఏ లోకి మార్చాలనే ప్రక్రియను ప్రారంభించాల ఆలోచనలు ప్రభుత్వం ఉంది**

హైదరాబాద్, సెప్టెంబర్ 26: ముదిరాజుల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా, సమిష్టిగా ముందుకు సాగాలని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు & క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. ముదిరాజుల సమస్యలు, రిజర్వేషన్లు, సామాజిక అభివృద్ధి వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తాను ఎప్పటికీ వెనుకడుగు వేయబోనని మంత్రి స్పష్టం చేశారు. "ముదిరాజుల కోసం ఏ అవకాశం వచ్చినా, నా పదవిని నా వ్యక్తిగత ప్రయోజనానికి కాకుండా జాతి ప్రయోజనానికి ఉపయోగించడమే నా లక్ష్యం" అని పేర్కొన్నారు. ముదిరాజులు సంఖ్యాపరంగా బలమైన సామాజిక వర్గమని, స్థానిక సంస్థల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లుగా అనేక మంది ప్రాతినిధ్యం వహిస్తున్నారని మంత్రి అన్నారు. ఈ సంఖ్యాబలాన్ని మరింత రాజకీయ, సామాజిక ప్రాతినిధ్యంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**కులగణనతో సంఖ్యాబలం స్పష్టమైంది**

తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన SEEEPC కులగణనలో ముదిరాజుల జనాభా సుమారు 26.36 లక్షలు, 7.43 శాతంగా నమోదైనట్లు తాజా ప్రచురిత వివరాలు వెల్లడిస్తున్నాయని మంత్రి తెలిపారు. ఈ గణాంకాలు ముదిరాజుల సంఖ్యాబలాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయని, ఈ సమాచారాన్ని విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమం వంటి అంశాల్లో విధానపరమైన చర్చలకు ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కులగణనలో లభించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగేలా విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**పండుగ సాయన్న స్ఫూర్తితో ముందుకు సాగాలి**

ముదిరాజుల చరిత్రలో పండుగ సాయన్న ఒక గొప్ప స్ఫూర్తి అని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. పేదలు, బడుగు వర్గాల కోసం పోరాడిన పండుగ సాయన్న వారసత్వాన్ని నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వపరంగా గుర్తించే అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని, ముదిరాజు ప్రతినిధులతో కలిసి చేసిన ప్రయత్నాలకు ఫలితం లభించిందని మంత్రి తెలిపారు.

**విద్యతోనే భవిష్యత్ మారుతుంది**

ముదిరాజు కుటుంబాలు తమ పిల్లలను తప్పనిసరిగా ఉన్నత విద్య చదివించాలని మంత్రి సూచించారు. "ముదిరాజు బిడ్డ అమెరికాకు ఎందుకు వెళ్లకూడదు పెద్ద వ్యాపారవేత్త ఎందుకు కాకూడదు ఐఏఎస్, ఐపీఎస్ ఎందుకు కాకూడదు" అని ప్రశ్నించారు. సమాజ అభివృద్ధికి విద్యే ప్రధాన మార్గమని, ముదిరాజు యువత ఉన్నత విద్య, ఉద్యోగాలు, వ్యాపారం, సాంకేతిక రంగాల్లో ముందుకు రావాలని సూచించారు. సమాజంలో ఇప్పటికే అనేక మంది ముదిరాజులు ఉన్నత స్థాయికి ఎదిగారని, వారి సంఖ్య మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

**ఐక్యతతోనే హక్కుల సాధన**

కులాభిమానం ఉండాలి కానీ అదే మొత్తం సమాజానికి పరిమితి కాకూడదని మంత్రి అన్నారు. సమాజంలోని ఇతర వర్గాలతో కలిసి ముందుకు సాగుతూ, రాజ్యాంగబద్ధమైన హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడాలని సూచించారు. "మనమంతా ఒక మాట మీద నిలబడితేనే మన హక్కులను సాధించుకోగలం. చట్టసభల్లో మన ప్రాతినిధ్యం పెరిగితేనే మన సమస్యలను బలంగా వినిపించగలం" అని మంత్రి అన్నారు. ముదిరాజుల హక్కుల కోసం జరుగుతున్న ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు తన వంతు కృషి కొనసాగుతుందని, ఈ విషయంలో తనపై నమ్మకం ఉంచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. "మన పిల్లల భవిష్యత్ కోసం, మన సమాజ అభివృద్ధి కోసం, రాబోయే తరాల హక్కుల కోసం మనమంతా కలిసికట్టుగా ముందుకు సాగుదాం" అని మంత్రి పిలుపునిచ్చారు.

## సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వర్ణ తోరణం పూజ



వేకువ సమయం సెప్టెంబర్ 26 కీసర ప్రతినిధి : కీసర: శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో ధ్వజస్తంభానికి ఏర్పాటు చేయనున్న స్వర్ణ తోరణం (తొడుగు)కు శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దాతలు పన్నాల సుధాకర్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు, తిరుక్కోవల్ భాస్కర స్వామి గురూజీ సహకారంతో ఈ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధ్వజస్తంభ స్వర్ణ తోరణానికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి, ఆలయ అభివృద్ధి, భక్తుల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాయల శ్రావణ్ కుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శి ఆనబోయిన జంగయ్య, కోశాధికారి జూపల్లి రవీందర్, శీలం శ్రీనివాస్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మాజీ చైర్మన్ నాయకపు వెంకటేష్, మాజీ ఎంపీటీసీ బెలిదే రమేష్ గుప్తా, గుర్రం మల్లారెడ్డి, మచ్చాని జంగయ్య యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్ రెడ్డి, గుర్రం లక్ష్మారెడ్డి, ముద్దం వెంకట్ యాదవ్, శీలం మల్లేష్, బండారి శ్రీనివాస్ రెడ్డి, కన్నెబోయిన రమేష్ ముదిరాజ్, రాగుల రమేష్, చినింగని సుధాకర్, జూపల్లి చంద్రయ్య, పండుగ రాజలింగం, మెట్టు మహేందర్ యాదవ్, మెట్టు పరమేష్ యాదవ్, బోడుసు రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ పురోహితులు ప్రభాకర్ పంతులు, వెంపటి సాయి కిరణ్ (బబ్లూ) పంతులు, కౌశిక్ పంతులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయానికి స్వర్ణ తోరణం సమకూర్చేందుకు సహకరించిన దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## వయోవృద్ధుల సంక్షేమానికి ప్రమాణాలు పాటించాలి

**డే కేర్ సెంటర్లు సీనియర్ సిటిజన్లకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలి: అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**




వేకువ సమయం సెప్టెంబర్ 26 కీసర ప్రతినిధి : షామీర్‌పేట్: వయోవృద్ధుల సంక్షేమం, వారి సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు వారికి అవసరమైన సేవలను మరింత మెరుగ్గా అందించేందుకు డే కేర్ సెంటర్లు కీలకంగా పనిచేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఫైజాన్ అహ్మద్ అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం-2026 వేడుకల్లో భాగంగా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం షామీర్‌పేట్ ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌లో 'కెపాసిటీ బిల్డింగ్ ఇన్ ఓల్డ్ ఏజ్ హోం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ వయోవృద్ధులు తమ వయసు కారణంగా ఎదుర్కొనే వివిధ సమస్యలను అధిగమించేందుకు అవసరమైన అవగాహన, నైపుణ్యాలు, సహాయక సేవలను అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. వృద్ధుల పట్ల గౌరవం, భద్రత, ఆత్మవిశ్వాసం పెంపొందించే విధంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని సూచించారు. డే కేర్ సెంటర్లలో సీనియర్ సిటిజన్లకు అందాల్సిన సౌకర్యాలు, సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. కేంద్రాల్లో నిర్దేశిత ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ వృద్ధులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. వృద్ధుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి, వారికి అందుతున్న సేవలను పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, సూపర్‌వైజర్లు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు, జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నాళ్ళకెన్నాళ్లకెన్నాళ్లకు అన్నాయి కుంటకు సాగునీటి విడుదల



అమరచింత : శివారులోని భూత్పూర్ కెనాల్ ద్వారా సాగునీరు అనాయకుంటకు వెళ్లడానికి సర్ ప్లస్ కాల్వను రైతులు జెసిబి ద్వారా స్వచ్ఛందంగా జమ్మూ పూడిక ముళ్లపదలు తీసుకొని అనాయుకుంట సాగు నీటిని విడుదల చేశారు,ఈ కార్యక్రమంలో మూడో వార్డు కౌన్సిలర్ తిరుమలేష్, మాజీ సర్పంచ్ గోపాల్, తెలంగాణ రైతు సంఘం నాయకుడు కే లక్ష్మీనారాయణ, కారడి శేఖర్ రెడ్డి, చిన్న వెంకటరెడ్డి,రవి, శ్రీకాంత్,రామ్ చందర్, బాయికాడి రాజు, డీలర్ శాంతన్న, కుమార్, రవి,నీరటి శాంతన్న, అదేవిధంగా రైతులందరూ తూములను పరిశీలించారు కుంటలు చెరువులు నిండి భూగర్భ జలాలు పెరుగుతవి అని అదేవిధంగా జంతువులు పక్షులు జీవరాశు లకు మేలు జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుక



వనపర్తి : జిల్లా పోలీస్ కార్యాలయంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి, హాజరై, చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి, మాట్లాడుతూ, రజాకారులను ఎదురించి తరిమికొట్టిన వీర వనితగా, పోరాట యోధు రాలిగా, ధైర్యశాలిగా చాకలి ఐలమ్మ చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. రైతాంగ హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.భూమిపై హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం, సమానత్వం కోసం పోరాడిన తొలి మహిళా ఉద్యమ నేతల్లో చాకలి ఐలమ్మ ఒకరని ఎస్పీ గుర్తుచేశారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏఆర్ వీరారెడ్డి, ఏవో సునంద, ఎస్బీ సీఐ నరేష్, ఆర్ఐ అడ్మిన్ అప్పలనాయుడు, ఆర్ఎస్ఐ వినోద్ మగ్దంబరి, ఆఫీస్ సూపరింటెండెంట్లు ఇంతియాజ్, శంకర్ లాల్ తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను సందర్శించిన జిల్లా సంక్షేమ అధికారి డి.సునంద..

**వయోవృద్ధుల సంక్షేమం కోసం అందరూ కృషి చేయాలి**



జోగులాంబ గద్వాల జిల్లా : కేంద్రంలోని రెండవ రైల్వే గేట్ సమీపంలో ఉన్న ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను జిల్లా మహిళా శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల సాధికారిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి సునంద శుక్రవారం సందర్శించారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం-2026ను పురస్కరించుకుని (సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1) వరకు నిర్వహిస్తున్న వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజు కార్యక్రమంలో భాగంగా ఆమె డే కేర్ సెంటర్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా అక్టోబర్ 1న నిర్వహించనున్న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ కార్యక్రమాల గురించి వయోవృద్ధులకు వివరించారు. అనంతరం డే కేర్ సెంటర్‌లో వయోవృద్ధులకు అందుతున్న సౌకర్యాలు, రోజువారీ కార్యక్రమాలు, భోజన వసతులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం చేస్తున్న వయోవృద్ధులను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడంతో పాటు, వారి సమస్యలు అవసరాలపై ఆరా తీశారు. అనంతరం డే కేర్ సెంటర్ పరిసరాలను పరిశీలించిన జిల్లా అధికారి సునంద అక్కడ ఏర్పాటు చేసిన పెరటి తోటను సందర్శించారు. సెంటర్‌లో ఖాళీగా ఉన్న స్థలంలో మరిన్ని పండ్ల మొక్కలను నాటి, పచ్చదనాన్ని పెంపొందించాలని నిర్వాహకుడు మహేష్ నాయుడుతో పాటు సిబ్బందికి సూచించారు. అలాగే డే కేర్ సెంటర్‌కు మరింత మంది వయోవృద్ధులు వచ్చేలా అవగాహన కల్పించి, వారి సంఖ్యను పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె సూచించారు. వయోవృద్ధులకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు అవసరమైన సౌకర్యాలు అందేలా నిరంతరం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డే కేర్ సెంటర్ నిర్వాహకులు,సిబ్బంది మరియు వయోవృద్ధులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు

**సెక్షన్ 7(6) నిబంధనలను అధికారులు తప్పనిసరిగా పాటించాలి**



నారాయణపేట జిల్లా: నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్లో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ నారాయణపేట జిల్లా ఇంచార్జీ ఎడ్ల కురుమయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎలిగండ్ల వెంకటేష్ ముదిరాజ్ పాల్గొని, మాట్లాడుతూ జిల్లాలో సెక్షన్ 6(1) ప్రకారం సమాచారం కోసం దరఖాస్తు చేస్తే అట్టి సమాచారాన్ని దరఖాస్తుదారుడి కి సెక్షన్ 7(1) ప్రకారంగా 30 రోజులు సమాచారాన్ని అందించాలి. కానీ అధికారులు నిర్లక్ష్యం చేస్తూ రెండు ,మూడు నెలలు గడచిన కూడా సమాచారం ఇవ్వకుండా అట్టి దరఖాస్తుదారుడికి రుసుము చెల్లించాలని నోటీసు పంపుతున్నారు. నిర్ణీత గడువులో సమాచారం ఇవ్వకుంటే ,సెక్షన్ 7(6) ప్రకారంగా ఉచిత సమాచారం అందించాలి. కానీ అధికారులు సెక్షన్ 7(6) నిబంధనను పాటించకుండా సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. సమాచార హక్కు చట్టం ప్రజల హక్కు.ఆ హక్కును అధికారులు గౌరవించాలి. చట్టం నిర్దేశించిన గడువులో సమాచారం అందించాలి. కాలయాపనకు తావు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటయ్య, అసెంబ్లీ అధ్యక్షులు గణేష్, జిల్లా సభ్యులు గజలప్ప, మురళి, రవి నాయక్, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

**క్రీడా సామాగ్రి పంపిణీ చేసిన జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్, లిప్స్**



నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 26 : తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో సెప్టెంబర్ 28 నుండి 30 వరకు క్లస్టర్ సి భాగంలో జరిగే రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్ క్రీడా పోటీలకు నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ శాఖ తరపున ఎంపికైన పోలీస్ సిబ్బందికి శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ గారు క్రీడా సామాగ్రిని (Sports Kit) అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణ ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి, శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా పోలీస్ శాఖకు విజయాన్ని, మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, ఎంపికైన క్రీడాకారులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యా సామర్థ్యాలను పెంపొందించాలి

# చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**విద్యార్థుల అభ్యసన స్థాయిల పెంపునకు పాఠశాలల వారీగా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయాలి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 26 : నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల విద్యా సామర్థ్యాలను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో మండల విద్యాధికారులు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ,తమ పరిధిలోని పాఠశాలల వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశించారు. ముఖ్యంగా వివిధ సబ్జెక్టుల్లో చదువులో వెనుకబడి సీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారి అభ్యసన స్థాయిని మెరుగుపరిచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు ఒక విద్యార్థిని దత్తత తీసుకుని ప్రత్యేక శ్రద్ధతో బోధన అందించాలని జిల్లా కలెక్టర్ విద్యాధికారులకు సూచించారు.

శనివారం సాయంత్రం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా సామర్థ్యాల పెంపుపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, డీఈఓ రమేష్ కుమార్‌తో కలిసి సమీక్ష సమావేశాన్నినిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ....., జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు పాఠశాల స్థాయి నుంచి పకడ్బందీగా చర్యలు చేపట్టాలని అన్నారు.

అన్ని తరగతి గదుల్లో సబ్జెక్టుల వారీగా ప్రతి విద్యార్థి విద్యా స్థాయిని గుర్తించి, వారి అవసరాలకు అనుగుణంగా బోధనా పద్ధతులను రూపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో సీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులను గుర్తించి వారి పూర్తి వివరాలతో కూడిన జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ జాబితా మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల వద్ద అందుబాటులో ఉండాలని సూచించారు.

సీ గ్రేడ్ విద్యార్థులను ప్రతి సబ్జెక్టు ఉపాధ్యాయుడు ఆయా సబ్జెక్టుల వెనుకబడిన విద్యార్థులను విధిగా దత్తత తీసుకుని, వారికి సబ్జెక్టుల వారీగా ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, అర్థమయ్యే రీతిలో ప్రత్యేక బోధన అందించాలని అన్నారు. ఆయా విద్యార్థుల ప్రగతిని క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, వారి అభ్యసన స్థాయిలో వచ్చిన మార్పులను నమోదు చేయాలని సూచించారు. విద్యార్థులు చదువులో వెనుకబడిన కారణాలను గుర్తించి, వారికి అవసరమైన అదనపు బోధన, పునశ్చరణ తరగతులు, వ్యక్తిగత శ్రద్ధ వంటి చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిరుత్సాహపరచకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి తన సామర్థ్యానికి అనుగుణంగా అభివృద్ధి చెందేలా ఉపాధ్యాయులు ప్రోత్సాహకరమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు.

విద్యార్థులకు అర్థమయ్యే సరళమైన బోధనా పద్ధతులను అనుసరించి, సబ్జెక్టుల వారీగా వారి సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని అన్నారు. విద్యార్థి ఏ అంశంలో వెనుకబడి ఉన్నాడో గుర్తించి, అదే అంశంపై అదనపు శ్రద్ధ పెట్టి అభ్యసన స్థాయిని మెరుగుపరచాలని సూచించారు. మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలల్లో బోధన జరుగుతున్న తీరును పరిశీలించడంతో పాటు, విద్యార్థుల అభ్యసన స్థాయిని స్వయంగా అంచనా వేయాలని సూచించారు.విద్యార్థుల విద్యా సామర్థ్యాల పెంపునకు సంబంధించి ఉపాధ్యాయులు చేపడుతున్న చర్యలను పరిశీలించి, అవసరమైన మార్గదర్శకాలు, సూచనలు అందించాలని మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.ప్రతి పాఠశాలలో విద్యార్థుల విద్యా సామర్థ్యాల ఆధారంగా పాఠశాలల వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ అన్నారు. కేవలం పరీక్షల సమయంలోనే విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయకుండా నిరంతరం వారి అభ్యసన ప్రగతిని పరిశీలించాలని సూచించారు.విద్యార్థులలో చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, గణిత నైపుణ్యాలు, సబ్జెక్టులపై అవగాహన వంటి ప్రాథమిక విద్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అన్నారు. ప్రతి విద్యార్థి కనీస విద్యా ప్రమాణాలను సాధించేలా ఉపాధ్యాయులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ప్రతి పాఠశాలలో సీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేకంగా చేపట్టిన చర్యలు, వారి విద్యా సామర్థ్యాల్లో వచ్చిన పురోగతిని తదుపరి సమీక్ష సమావేశం నాటికి స్పష్టంగా చూపించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాల పెంపు అనేది ఒక్క ఉపాధ్యాయుడి బాధ్యత మాత్రమే కాదని, ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, మండల విద్యాధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంతో పాటు, చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని ముందుకు తీసుకురావడమే లక్ష్యంగా అధికారులు, ఉపాధ్యాయులు సమష్టిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశించారు.

ఈ సమావేశంలో డీఈఓ రమేష్ కుమార్, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి కిరణ్ కుమార్, సెక్టోరియల్ అధికారి నూరుద్దీన్, వెంకటేశ్వర్లు శెట్టి ,మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

### సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయం



మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 26: చాకలి ఐలమ్మ అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన గొప్ప యోధురాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ చూపిన ధైర్యం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన కృషిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా రెవెన్యూ అధికారి ఏ. నిర్మల, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

## మూగ, చెవిటి వారిని గుర్తించి న్యాయ సేవలు అందేలా చూడాలి

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతి మురారి**




మహబూబాబాద్ జిల్లా; (సెప్టెంబర్ 26 వేకువ సమయం ప్రతినిధి); సెప్టెంబర్ 27 'ప్రపంచ బధిరుల దినోత్సవం' జరుపుకోనున్న నేపథ్యంలో, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతి మురారి పారా లీగల్ వాలంటీర్లతో ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతి మురారి మాట్లాడుతూ.. సమాజంలో ఉన్న మూగ మరియు చెవిటి వారిని (బధిరులను) క్షేత్రస్థాయిలో గుర్తించాల్సిన కీలక బాధ్యత పారా లీగల్ వాలంటీర్లపై ఉందన్నారు. కేవలం వారిని గుర్తించడమే కాకుండా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా వారికి లభించే ఉచిత న్యాయ సేవలు, సలహాలు, చట్టపరమైన హక్కుల గురించి వారికి పూర్తిగా అవగాహన కల్పించాలని ఆమె ఆదేశించారు. భావ వ్యక్తీకరణ చేయలేకపోవడం లేదా వినికిడి లోపం వల్ల వారు ఏ ఒక్క దశలోనూ న్యాయానికి, చట్టపరమైన రక్షణకు దూరం కాకూడదని ఆమె స్పష్టం చేశారు. పారా లీగల్ వాలంటీర్లు ఆయా ప్రాంతాల్లో ఉన్న బధిరులను స్వయంగా కలిసి, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై దిశానిర్దేశం చేయాలని సూచించారు. ఏదైనా న్యాయపరమైన లేదా హక్కుల ఉల్లంఘన సమస్యలు ఎదురైతే వెంటనే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకువచ్చేలా వారికి భరోసా కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పారా లీగల్ వాలంటీర్లు, పాల్గొన్నారు.

## కీసర ఔటర్ రింగ్ రోడ్డు పై టైరు పేలి వాహనం బోల్తా.. ఇద్దరి మృతి

వేకువ సమయం సెప్టెంబర్ 26 కీసర ప్రతినిధి : కీసర: కూలీలతో వెళ్తున్న అశోక్ లేలాండ్ వాహనం టైరు పేలి బోల్తా పడిన ఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుపై చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో 11 మందికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. కీసర నుంచి షామీర్‌పేట్ వైపు కూలీలతో వెళ్తున్న వాహనం వెనుక టైరు ఒక్కసారిగా పేలింది. దీంతో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో పల్టీలు కొట్టింది. ప్రమాదంలో చర్లపల్లిలో నివాసముంటున్న మహబూబ్‌నగర్‌కు చెందిన మంగీలాల్ (60), మహారాష్ట్రకు చెందిన సురేఖ (40) మృతి చెందారు. మరో 11 మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కీసర పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అభాగ్యులకు అండగా న్యాయ సేవాధికార సంస్థ

**- సబ్ జైలులో విచారణ ఖైదీలతో ప్రధాన జిల్లా న్యాయమూర్తి కె. మురళీ మోహన్ ముఖాముఖి**




మహబూబాబాద్ జిల్లా: (సెప్టెంబర్ 26 వేకువ సమయం ప్రతినిధి); సమాజంలో బలహీనవర్గాలకు న్యాయ సేవాధికార సంస్థ అండగా నిలుస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. మురళీ మోహన్ ఉద్ఘాటించారు. శనివారం స్థానిక సబ్ జైలును న్యాయమూర్తి సందర్శించి, అక్కడ విచారణలో ఉన్న ఖైదీలతో ప్రత్యేకంగా ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతూ.. వారి హక్కుల గురించి మరియు జీవితం పట్ల ఉండాల్సిన దృక్పథం గురించి పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ని ఉటంకిస్తూ.. చట్టం నిర్దేశించిన విధానం ద్వారా తప్ప ఏ వ్యక్తి యొక్క ప్రాణాన్ని లేదా వ్యక్తిగత స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదని ఆయన స్పష్టం చేశారు. మహాకవి శ్రీశ్రీ చెప్పినట్లు "కుక్కల వలె, నక్కల వలె" బ్రతకడం మనిషి జీవితం కాదని, జీవించడం అంటే కేవలం ప్రాణాలతో ఉండటం మాత్రమే కాదని ఆయన గుర్తుచేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతో, ఎలాంటి అణచివేతకు గురికాకుండా స్వేచ్ఛగా, గౌరవప్రదంగా జీవించడమే అసలైన జీవితమని నొక్కి చెప్పారు. సమాజంలో అభాగ్యులకు ఇలాంటి గౌరవప్రదమైన జీవితాన్ని, సత్వర న్యాయాన్ని అందించడం కోసమే 'న్యాయ సేవాధికార సంస్థలు' ఏర్పాటయ్యాయని ఆయన వివరించారు. ఉచిత న్యాయ సాయం అనగానే అది సరిగా ఉండదేమోనని ఎవరూ సందేహించాల్సిన అవసరం లేదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కు ఎక్స్-అఫీషియో చైర్మన్ హోదాలో జిల్లా న్యాయమూర్తి స్వయంగా ఈ ఉచిత న్యాయ సేవల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని, కాబట్టి నిరుపేదలు పూర్తి నమ్మకంతో న్యాయ సహాయం పొందవచ్చని ఆయన భరోసా ఇచ్చారు. ?జైలులో ఉన్నంత మాత్రాన ప్రాథమిక హక్కులు కోల్పోయినట్లు కాదని, విచారణలో ఉన్న ఖైదీలకు కూడా ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు మరియు పరిశుభ్రమైన వాతావరణం పొందే పూర్తి హక్కు ఉందని ఆయన జైలు అధికారులకు మరియు ఖైదీలకు గుర్తుచేశారు. ఒక గొంగళిపురుగు తనను తాను బంధించుకుని కొంతకాలం తర్వాత ఎలాగైతే అందమైన సీతాకోకచిలుకగా బయటకు వస్తుందో, ఈ జైలు జీవితాన్ని కూడా మీరు అలాంటి ఒక మార్పు కోసం వినియోగించుకోవాలన్నారు.ఇక్కడ గడిపిన సమయాన్ని పశ్చాత్తాపంతో, మంచి ఆలోచనలతో గడిపి, జైలు నుండి బయటకు వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ సమాజం మెచ్చుకునే ఆదర్శవంతమైన వ్యక్తులుగా మారాలని హితవు పలికారు. అనంతరం జైల్లోని అన్ని బ్యారక్ లను, వంటగదిని మరియు సరుకుల నిల్వ గది ని పరిశీలించారు. ఈ సందర్శనలో ఆయన వెంట చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ దాసరి నాగేశ్వరరావు, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ వి రాజు కృష్ణ, జైలర్ శ్రీనివాస్, పారా లీగల్ వాలంటీర్ రాంప్రభూ పాల్గొన్నారు.

## జాషువా కవిత్వంలో.. జాతీయోద్యమం!

సమయం ప్రతినిధి : 'భరత ఖండంబు నా పాఠశాల' అన్నాడు మహాకవి జాషువ. దేశం పట్ల అత్యంత భక్తిప్రపత్తులను ప్రదర్శించాడు. దేశ సాంస్కృతిక, చారిత్రక వైభవాన్ని పలవరిస్తూ కవిత్వం రాశాడు. చారిత్రక పురుషుల గొప్పతనంలో భారతీయ విశిష్టత దాగి వుందని భావించాడు. జాతీయోద్యమం కాలాన కలం పట్టిన జాషువ మహాకవి... స్వేచ్ఛా భారతావనిని కలలుగంటూ జాతీయోద్యమ సాహిత్యాన్ని సృజించాడు. బుద్ధుడు, గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, రామకృష్ణ పరమహంస, ఇత్యాది దేశీయ నాయకుల గొప్పతనాన్ని చాటుతూ జాతీయోద్యమానికి పూనికగా నిలబడి కవిత్వం రాశాడు. బుద్ధుని అహింసా మార్గాన్ని, నైతిక జీవితాన్ని, గాంధీ సత్యవర్తనను, హృదయానికి హత్తుకొని విశ్వనరుడిగా రచనా వ్యాసంగాన్ని కొనసాగించాడు. సామాజికంగా తాను అంటరానితనాన్ని అనుభవిస్తున్నా, దేశ విముక్తి కోసం జరుగుతున్న జాతీయోద్యమానికి దన్నుగా కవిత్వం రాశాడు. గాంధీ ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని, స్వతంత్ర భారతావనిలో తన జాతి జనులకు దక్కాల్సిన వాటా తమకు దక్కుతుందని నమ్మాడు. గోచిపాత గట్టుకొని జాతిమానంబు / నిలిపినట్టి ఖద్దరు నేతగాడు / విశ్వ సామరస్య విజ్ఞాన సంధాత / కామిత ప్రదాత గాంధీ తాత – – అంటూ ఎలుగెత్తి చాటాడు. గాంధీ అహింసా సిద్ధాంత ధోరణే తన జీవిత మార్గంగా నమ్మాడు. తెలుగు సాహిత్యంలోనూ గాంధీ ప్రభావ సాహిత్యం విరివిగానే వచ్చింది. గాంధీని హృదయానికి హత్తుకొని, గాంధేయవాదాన్ని జీవనమార్గంగా ఎన్నుకొని కవిత్వం రాసిన అత్యంత ప్రతిభావంతుడైన తెలుగు కవి గుర్రం జాషువ. ప్రపంచమంతా ఏదైనా మంచి, సత్యం, అహింస, శాంతిలకు సంబంధించిన అంశాలు ఉన్నాయంటే వాటి మూలాలు కచ్చితంగా బౌద్ధంలోనే ఉన్నాయి. మహాత్మాగాంధీ అనుసరించిన సత్యం, అహింసలకు మూలాలు కూడా బౌద్ధంలోనే ఉన్నాయి. గుర్రం జాషువాకు బుద్ధుడంటే ప్రాణం. ఆయన విశ్వనర భావన బుద్ధుని మానవీయ సిద్ధాంతం నుంచి తీసుకున్నదే. జాషువా తన కవిత్వంలో మహాపురుషులందరినీ వర్ణించాడు.అంబేడ్కర్ గురించి జాషువ 'గబ్బిలం' కావ్యంలో 'కలడంబేడ్కర్ నా సహోదరుడు మాకైయష్ట కష్టాలకుం, బలియై' అని వర్ణించాడు. విద్వాంసుడైన అంబేడ్కర్ దళితజాతి కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని జాషువా అభిప్రాయపడ్డాడు.గాంధీ ద్వారానే భారతదేశానికి స్వాతంత్ర్యం వస్తుందని, తమ వాటా తమకు లభిస్తుందని స్వాతంత్ర్యానికి ముందు రాసిన 'గబ్బిలం' కావ్యంలో అభిప్రాయపడ్డాడు. నిమ్నజాతుల కన్నీటి నీరదములు––పిడుగులై దేహమును గాల్చి వేయననుచూ... రాట్నమును దుడ్డుగర్ర కరానబూని దెసల దోతెంచె గుజరాతు ముసలిశెట్టి 'గబ్బిలం' రాసే నాటికి స్వాతంత్ర్య పోరాట రథసారథిగా ఉన్న గాంధీజీ తరతరాలుగా వేదనకు గురవుతున్న నిమ్నజాతుల కన్నీటిని తుడిచేవాడుగానే జాషువాకు కనబడ్డాడు. ఊరి వెలుపల అంటరానివారిగా ఉన్న మాలమాదిగలు కూడా మనుషులేనని దేశం గుర్తిస్తుందని జాషువా అభిప్రాయపడ్డాడు. మహాత్ముడి స్వాతంత్ర్యోద్యమం ద్వారా దళితులకు రాజ్యాభిషేకం రావచ్చని అభిప్రాయపడ్డాడు.'ఏ జాతికి ఎంత వచ్చునో/ రాజత్వంబంత నాకు రావచ్చుకదా!' అనే పద్యంలో ఈ భావన వ్యక్తమవుతుంది. జాషువా దృష్టిలో సబర్మతి వాసియైన గాంధీజీ ఆదిదేవుడు, బుద్ధునితో సమానమైనవాడు. సీమదొరలను కూడా లక్ష్యపెట్టని ధైర్యశాలి. గాంధీ అహింసా సిద్ధాంతంపై, జాతీయోద్యమంపై ఎనలేని గౌరవం, నమ్మకం, భక్తిప్రపత్తులున్నాయి. కర్రలు, ఖడ్గాలతోని, ప్రజలనేలే రోజులు పోయాయని ఇది జ్ఞానఖనియైన గాంధీయుగమంటాడు. దళితజాతి ఉద్ధరణకై 'గబ్బిలం'తో ఈశ్వరునికి సందేశం పంపిన జాషువా గాంధీజీతో దళితోద్ధరణ జరుగుతుందని హృదయపూర్వకంగానే నమ్మాడు. 'బాపూజీ' అనే పేరుతో ఓ ఖండకావ్యం రాసిన జాషువా అసలుసిసలైన గాంధేయవాది. సంపన్న వర్గాల్లో గర్వం తగ్గి పేదల పట్ల సమదృష్టి ఉండాలన్న భావాన్ని ప్రదర్శించేందుకు గాంధీ పంచెకట్టు కడితే, నిరుపేదలైన దళితజాతిలో ఆత్మవిశ్వాసం నింపడానికి హుందాగా ఉండాలని అంబేడ్కర్ సూటూబూటూ ధరించాడు. అర్ధ దిగంబరుడైన గాంధీ... దళితుల పాలిట దైవమైన అంబేడ్కర్ బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో రాజీలేని పోరాటం చేశారని జాషువా ఆ ఇద్దరు మహాత్ములను ఆరాధించాడు.క్షమా ప్రవాసి, పండుముసలి గాంధీ తుపాకీ గుండుకెరయై మరణించడంపై జాషువా భారత జాతి హృదయాలను మెలిపెట్టేంత అర్థమైన పద్యాలను రాశాడు. కన్నీటి వరద పారించాడు. 'అహింసామూర్తి, శాంతి, సహనం, సత్యం, జీవన మార్గాలుగా ఎంచుకున్న గాంధీజీని హత్యగావించటం భారతదేశానికి మాయని మచ్చ. గాడ్సేలాంటి 'మత్త చిత్తుల తలలు ఖండించినా అది మాయదు కదా' అని వాపోతాడు.స్వాతంత్ర్య మహోత్సవ జయజయ ధ్వనులు వినిపిస్తూండగానే జరిగిన గాంధీ హత్య బాపూజీపై అద్భుత కావ్యం రాసేట్టు చేసింది. ఈ కలికాలంలో ఏసుక్రీస్తుతో గాంధీజీ సమానమైన వాడని జాషువా అభిప్రాయం. ప్రపంచానికే శాంతి, సత్యం, సహనం, అనే విద్యలను నేర్పిన అహింసావాది అని నమ్మాడు. సీమ దొరల శిలా సదృశ్యమైన మనసులను కరిగించి భారతజాతి దాస్యశృంఖలాలు తెంపిన అహింసామూర్తి లేని లోటు ఎలా తీరుతుందని వాపోతాడు. క్రైస్తవులకు అచ్చమైన క్రైస్తవుడని, బౌద్ధ బిక్షువులకు ఏ మచ్చా లేని బుద్ధుని వంటి వాడని, ముసల్మానులకు అచ్చమైన ఫకీరని ఆ మహాత్మునికి నివాళు లర్పించాడు.నెహ్రూ తన చితాభస్మాన్ని భారతదేశంలోని నదులన్నిటిలో కలపమన్నాడు. అలా తాను ఈ దేశపు పంట భూములలో శాశ్వతంగా నిలిచితానన్నాడు.



# బౌద్ధం పల్లవించిన నేల

**వైశాఖ పౌర్ణమి ఎంతో ప్రత్యేకమైన రోజు. గౌతమ బుద్ధుడు జన్మించిన రోజే కాదు, ఆయన జ్ఞానోదయం పొందినదీ, మహా పరినిర్వాణాన్ని పొందినదీ ఈ రోజే. ఈ పవిత్రమైన రోజును ప్రపంచవ్యాప్తంగా బౌద్ధులు 'వేసాక్' పండుగగా భక్తి శ్రద్ధలతో జరుపుకొంటారు.**

**రాజకుమారుడైన సిద్ధార్థుడు జీవితంలో దుఃఖాలను చూసి, వాటిని సంపూర్ణంగా రూపుమాపాలని సంకల్పించాడు. సర్వ సౌఖ్యాలను పరిత్యజించి, తపోధ్యాన నిష్టలతో... బుద్ధ గయలో సాధన చేసి, చివరకు సమాధానాన్ని కనుక్కోగలిగాడు. బుద్ధునిగా మారాడు. లోకానికి అహింస, సత్యం, శాంతి, దయా మార్గాలను చూపించాడు. చతురార్య సత్యాలతో, అష్టాంగ మార్గం ద్వారా మనిషి ఉత్కృష్ట జీవితం ఎలా గడపాలో తను ఆచరించాడు, ఉపదేశించాడు.**

### జ్ఞానపిపాసి బావరి...

ప్రాచీన కాలంలో ఆంధక దేశంగా విఖ్యాతి పొందిన ఈ తెలుగు భూమి... బౌద్ధ ధర్మ చరిత్రలో ఒక దివ్య అధ్యాయంగా నిలిచింది. ఈ నేల బుద్ధుని బోధలను ఆహ్వానించడమే కాదు... వాటిని ఆత్మలో నిలుపుకొంది. తాత్విక వికాసానికి, ఆధ్యాత్మిక ప్రసారానికి కేంద్రబిందువయింది. గోదావరి తీరంలో తపస్సంపన్నుడైన బావరి మహర్షి నుంచి శూన్యతాతత్త్వాన్ని విశదీకరించిన నాగార్జునుడి వరకు... ఈ ప్రాంతం బౌద్ధంతో అంతర్లీనంగా అనుసంధానమయింది. బావరి కథ ఆ అనుబంధానికి తొలి సాక్ష్యంగా నిలుస్తుంది. గోదావరి నదీ తీరాన ఆశ్రమవాసిగా నివసించిన బావరి... జ్ఞానపిపాసతో నిండిన మహర్షి. బుద్ధుడు బోధి సంపూర్ణుడై వెలుగొందిన వార్త విని... తన శిష్యులను ఆయన సన్నిధికి పంపించాడు. వారు బుద్ధుని దర్శించి, బుద్ధ వాక్యామృతాన్ని ఆస్వాదించి, సత్య సాక్షాత్కారాన్ని పొందారు. ఈ ఘట్టం ద్వారా... బుద్ధుని జీవిత కాలంలోనే ఆంధక దేశానికి బౌద్ధ ధర్మ ప్రవాహం చేరినట్టు స్పష్టమవుతుంది. తరువాత ఈ ప్రాంతం బౌద్ధ సంస్కృతికి పుష్టిని ఇచ్చిన పుణ్యభూమిగా పరిణమించింది. కృష్ణా, గోదావరి నదుల సస్యశ్యామల తీరాలు సంపన్న జీవన విధానాన్ని ప్రసాదించి... విహారాలు, స్తూపాలు, చైత్యాల నిర్మాణానికి దోహదపడ్డాయి. అమరావతి, నాగార్జున కొండ, ధూలికట్ట లాంటి క్షేత్రాలు నేటికీ ఆ వైభవానికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. అక్కడి శిలాశాసనాలు, శిల్ప కళాకృతులు, విహారావశేషాలు... ఇవన్నీ కలిసి బౌద్ధం ఈ నేలపై ఎంతగా విస్తరించిందో మౌనంగా వివరిస్తున్నాయి.

### నాగార్జునుడి 'శూన్యతా' సూత్రం

ఈ ఆధ్యాత్మిక వేదికపై ప్రకాశించిన మహామేధావి నాగార్జునుడు. ఆయన మహాయాన బౌద్ధంలో మాధ్యమిక తత్త్వానికి రూపకల్పన చేసి... 'శూన్యత' అనే సూత్రాన్ని లోతుగా ప్రతిపాదించాడు. సర్వ ధర్మాలకూ స్వతంత్ర రూపం లేదని, పరస్పరాధారితత్వమే సత్యమనీ ఆయన బోధించాడు. ఈ తాత్విక దృక్పథం బౌద్ధాన్ని మరింత విశాలంగా, లోతుగా విస్తరింపజేసింది. ఆయన శిష్యుల్లో ఆర్యదేవుడు లాంటి ఆచార్యులు కూడా ఈ తత్త్వ జ్ఞానాన్ని మరింత ప్రచారం చేశారు.

### మళ్ళీ మళ్ళీ జన్మించడమే దుఃఖం

ఈనాడు కొందరు బౌద్ధాన్ని వారు నమ్మిన సిద్ధాంతాలతో జోడించి... తదనుగుణంగా బుద్ధుడి బోధనలను వ్యాఖ్యానించడం విచారకరం. అసలు బుద్ధుడు ఏ విషయాలను వివరించాడో తెలుసుకోకుండా... సామ్యవాది అని కొందరు అంటే, మరికొందరు వర్ణ వ్యవస్థను నిర్మూలించడానికి మాత్రమే అవతరించిన సామాన్య సమాజోద్ధారకుడిగా వర్ణించడం శోచనీయం. బౌద్ధం ఆచార ప్రధానమైనది. వ్యక్తి నైతిక సదాచారాలతోనే మోక్ష మార్గంలోకి ప్రవేశించగలుగుతాడని బుద్ధుడు వివరించాడు. దుఃఖ నిరోధమే నిర్వాణం. 'దుక్ఖా జాతి పునప్పునంఖ' (మళ్ళీ మళ్ళీ జన్మించడమే దుఃఖం) అన్న బుద్ధుడి తాత్త్వికోపదేశమే శంకరుల ద్వారా 'పునరపి జననం పునరపి మరణం' అనిపించింది. బౌద్ధ సాహిత్యం సంస్కృత, పాళీ భాషలలో సమృద్ధమై విలసిల్లింది. కాని నేడు రెండు కారణాలవల్ల ఆ అద్భుత సాహిత్యం మరుగునపడింది. అందులో మొదటిది... ఇంత విశాలమైన సాహిత్యాన్ని చదివే నాథులే లేరు, రెండోది... ఈ అద్భుత సాహిత్యాన్ని చదవకుండానే ఇది నాస్తికమని, సనాతన విరుద్ధమని భావించడం. ఇది దురదృష్టకరం. బుద్ధుని బోధనలను అందరూ చదివి తీరాలి.

ఆంధక దేశంలోని విహారాలు ప్రార్థనాలయాలుగానే కాకుండా... జ్ఞాన కేంద్రాలుగా, తాత్త్విక సంభాషణలకు వేదికలుగా వికసించాయి. వాణిజ్య మార్గాల సామీప్యం ఈ ప్రాంతాన్ని శ్రీలంక, దక్షిణాసియా దేశాలతో అనుసంధానించింది, బౌద్ధ ధర్మాన్ని సముద్రాలు దాటి విస్తరింపజేసింది. అమరావతి శిల్ప కళలో బుద్ధుని జీవగాథలు, జాతక కథలు సజీవ చిత్రాల్లా ఆవిష్కృతమై, దర్శనార్థులను ధ్యాన ముగ్ధుల్ని చేస్తాయి. ఆ శిల్ప రేఖల్లో తత్త్వం పలుకుతుంది. ఆ కళలో కరుణ నిండుగా కనిపిస్తుంది. పవిత్రమైన బుద్ధ జయంతిరోజున మనం మనలోని కోపం, ద్వేషం, అసూయలను వదిలిపెట్టాలి, ప్రేమ, దయ, సహనంతో జీవించడానికి ప్రయత్నించాలి. పేదలకు సహాయం చేయాలి. ఇతరులకు సంతోషం కలిగించాలి. అదే బుద్ధుడికి నిజమైన నివాళి.



# తేనెలూరే అభిరుచి

మంచి జీతం... సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలిపెట్టి... కష్టమని తెలిసినా తేనె సాగు చేపట్టారు. అమెరికాలో వ్యవసాయం చేస్తున్న అక్క స్ఫూర్తితో... అంకుర సంస్థను స్థాపించి అభిరుచికి పట్టం కట్టారు. సవాళ్లను స్వీకరించి... ఒడుదొడుకులను అధిగమించి... మరికొంత మంది మహిళలకు ఉపాధి మార్గమయ్యారు. విభిన్న రంగంలోకి అడుగిడి... అందరి ప్రశంసలు అందుకొంటున్న యువతి... కూచిపూడి కృష్ణవేణితో మాటామంతి.

"అందరిలా చదువు కాగానే నేనూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వెంట పరుగెత్తా. రెండేళ్లు ఐటీలో పని చేశా. కానీ సంతృప్తినివ్వలేదు. అందుకే ఆ కొలువు వద్దనుకుని బయటకు వచ్చేశాను. అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ చదివే రోజుల్లోనే నాకు వ్యవసాయంపై మక్కువ కలిగింది. మా పొలంలోనే సేంద్రియ సాగు చేసి లాభసాటి వ్యవసాయాన్ని మా నాన్నకు బహుమతిగా ఇవ్వాలనుకున్నా. కానీ అనుకున్నవన్నీ జరిగితే అది జీవితం ఎందుకు అవుతుంది! గుంటూరు జిల్లా తెనాలిలో ఓ చిన్న ఇంట్లో మా నివాసం. నాన్న కూచిపూడి బసవపున్నయ్య. అమ్మ వెంకటేశ్వరమ్మ. ఐదుగురు సంతానంలో నలుగురు అక్కచెల్లెళ్లం. నాన్న మాకున్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేసి, మమ్మల్ని అందరినీ ప్రయోజకులను చేశారు. ఆయన పడ్డ కష్టానికి ఫలితంగా ఐదుగురం సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు సంపాదించాం.

### ఆ ఇష్టంతోనే...

నాకు మొదటి నుంచీ ఆర్గానిక్ సాగుపై ఇష్టం ఉండేది. కానీ కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో అది కుదరలేదు. ఇంజినీరింగ్ అయ్యాక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. రెండేళ్ల అతి కష్టం మీద పని చేశాను. ఎప్పుడు ఉద్యోగం ఉంటుందో... ఎప్పుడు పోతుందో తెలియని సందిగ్ధంలో... రోజుకొక గండంలా గడుపుతున్న నా సహచరులను ఎందరినో చూశా. ఉద్యోగం ఉన్నా భరించలేని ఒత్తిడి. ఇలాంటి కొలువుల్లో కొనసాగడం నావల్ల కాదని ఐటీ నుంచి బయటకు వచ్చేశాను. తర్వాత చెన్నైలోని ఓ అగ్రీ కంపెనీలో చేరాను. ఆ ఉద్యోగం చేస్తున్నప్పుడే ఒక కొటేషన్ నన్ను బాగా అకట్టుకుంది. 'ఒకవేళ భూమిపై నుంచి తేనెటీగలు కనుమరుగైపోతే, మానవుడు జీవించటానికి కేవలం నాలుగు సంవత్సరాల ఆయుష్షు మాత్రమే మిగిలి ఉంటుంది'... అనేది కొటేషన్. అంటే తేనెటీగలు లేకపోతే మొక్కలలో పరాగ సంపర్కం ఉండదని, మొక్కలు లేకపోతే జంతువులు, మానవుడి మనుగడ భూమిపై ఉండదనేది దాని అర్థం. ఇప్పటికే తుమ్మెదలు చాలావరకు అంతరించిపోయాయి. తేనెటీగలే ఫల సాయానికి కీలకంగా మారాయి. వీటిని కూడా కాపాడుకోలేకపోతే రేపటి రోజున మా నాన్న లాంటి రైతులు ఏమైపోతారనే ఆందోళన మొదలయింది. దీన్ని అందరికీ అర్థమయ్యేలా చెప్పాలనే ఉద్దేశంతోనే... ఆ ఉద్యోగం కూడా వదిలేసి తేనె పరిశ్రమ పెడదామని నిర్ణయించుకున్నా.

### సోదరి స్ఫూర్తితో...

విషయం నాన్నతో పాటు అమెరికాలో ఉన్న నా సోదరి రాజ్యలక్ష్మికి చెప్పాను. తను అక్కడ కొద్దిపాటి భూమిలో సేంద్రియ పద్ధతిలో పంటలు పండిస్తోంది. తనే నాకు స్ఫూర్తి. పూర్తి స్థాయి అవగాహన కోసం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ కె.మోహనరావును, హనీబీ రైతు సంఘాలను కలిశాను. తెనాలికి తిరిగివచ్చి రూ. 1.5 లక్షలతో 200 తేనె పెట్టెలు తీసుకున్నా. అయితే ఆ పెట్టెలను అమర్చటం చాలా కష్టం.

# చుండ్రు వేధిస్తోందా..

**ఎండాకాలంలో వేడివల్ల తలలో అధికంగా చెమట పట్టి చుండ్రు మాడుకు అతుక్కుపోతుంది. దీంతో తలంతా దురదగా అనిపిస్తుంటుంది. అలాంటప్పుడు చిన్న చిట్కాలతో ఈ చుండ్రును వదిలించుకోవచ్చు.**



చిన్న గిన్నెలో నాలుగు చెంచాల నిమ్మరసాన్ని తీసుకుని అందులో అయిదు చెంచాల మంచినీళ్లు కలపాలి. ఈ మిశ్రమాన్ని చేత్తో కొద్ది కొద్దిగా తీసుకుంటూ మాడుకు పట్టించి పావుగంట తరువాత గోరువెచ్చటి నీటితో తలస్నానం చేయాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే మాడు మీద పీహెచ్ స్థాయిలు సమతుల్యమై చుండ్రు మాయమవుతుంది.

పెద్ద గిన్నె నిండా నీళ్లు పోసి అందులో రెండు గుప్పెళ్ల వేపాకులు వేసి బాగా మరిగించాలి. ఈ నీటిని గోరువెచ్చగా చల్లార్చి తలకు పట్టించి అరగంట తరువాత తలస్నానం చేస్తే మంచి ప్రయోజనం కనిపిస్తుంది.

రాత్రి పడుకునేముందు చిన్న కప్పు మెంతులను నీళ్లలో నానబెట్టాలి. ఉదయాన్నే వీటిని మెత్తగా రుబ్బి తలకు పట్టించి అరగంట తరువాత గోరువెచ్చటి నీటితో తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే మాడుమీద చర్మం తేమతో నిండి చుండ్రు తగ్గుతుంది.

కలబంద గుజ్జును చల్లటి నీటిలో ముంచి తీసి మాడుకు పట్టించి అరగంట తరువాత తలస్నానం చేయాలి. ఇలా రెండు రోజులకోసారి చేస్తూ ఉంటే కలబందలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ప్రభావవంతంగా పనిచేసి చుండ్రును తొలగిస్తాయి.

పెరుగు లేదా కోడిగుడ్డు తెల్ల సొనను మాడుకు పట్టించి తలస్నానం చేసినా మంచి ఫలితం కనిపిస్తుంది.

యాపిల్ సైడర్ వెనిగర్, మంచినీళ్లను సమపాళ్లలో కలిపి తలకు పట్టించి ఒక పూట తరువాత తలస్నానం చేసినా ప్రయోజనం ఉంటుంది.

రెండు చెంచాల కొబ్బరి నూనెలో చెంచా టీ ట్రీ ఆయిల్ కలిపిన మిశ్రమాన్ని లేదా మందార నూనెను పట్టించినా చుండ్రు తొలగి మాడు ఆరోగ్యవంతంగా మారుతుంది.




# టైటిల్ కాకా.. సినిమా కేక

మెగాస్టార్ చిరంజీవి సినీ కెరీర్ మొదలుపెట్టి 48 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఇటీవల హైదరాబాద్ లోని ఓ హోటల్ లో మెగా యూత్ ఫోర్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలో అభిమాను సత్కరించారు. ఈ వేడుకలో చిరంజీవి మాట్లాడుతూ "ప్రస్తుతం 'కాకా' సినిమాలో నటిస్తున్నాను. ఇందులో నా పాత్ర పేరు కదిరి కాళిదాసు. ఈ సినిమా చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఇందులో చాలా హెవీ సీన్స్ చేస్తున్నాను. సినిమా కోసం ప్రతిరోజూ తెల్లవారుజామున 4.30 గంటలకే నిద్రలేస్తాను. ఆ తర్వాత గంటపాటు కచ్చితంగా వ్యాయామం చేస్తాను. మేకప్ పూర్తి చేసుకుని ఉదయం 8 గంటలకే కోకాపేటలోని షూటింగ్ సెట్స్‌కు చేరుకుంటాను. నేను సమయానికి సెట్స్‌కు రావడం గొప్పగా చెప్పుకోవడానికి కాదు. నేను 10 గంటలకు వచ్చినా నన్ను ఎవరూ అడగరు. కానీ నేనే క్రమశిక్షణ పాటించకపోతే, మిగిలిన టీమ్ ఎలా ఉంటుంది? ఒక సినిమా అనేది ఎంతోమంది కలిసి పనిచేసే ప్రక్రియ. అందులో ప్రతి ఒక్కరి సమయం ఎంతో విలువైనది. అందుకే నేను నా వంతుగా సమయపాలన పాటిస్తాను. నా దర్శకులందరూ కూడా ఉదయం 7 గంటలకే పూర్తి టీమ్‌తో సెట్స్‌లో సిద్ధంగా ఉంటారు. ప్రతి ఒక్కరూ తమ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అమెరికా అధ్యక్షుడికైనా, ఇక్కడి సాధారణ కార్మికుడికైనా రోజుకు 24 గంటలే ఉంటాయి. కాబట్టి మనకు ఉన్న సమయాన్ని ఎంత బాగా ఉపయోగించుకుంటామన్నదే ముఖ్యం. నా 48 ఏళ్ల సినీ ప్రయాణంలో అభిమానుల ప్రేమ, అభిమానం నాకు ఎంతో బలాన్ని ఇచ్చాయి. 'మెగా యూత్ ఫోర్స్' మరింత బలోపేతం కావడానికి మీ అందరి సహాయ సహకారాలు నాకు కావాలి. అభిమానులు నా నుంచి ఏం కోరుకుంటున్నారో అది అందించడానికి నేను ఎప్పుడూ సిద్ధంగా ఉంటాను. మిమ్మల్ని వీలైనంతగా అలరించడంపైనే నా దృష్టి ఉంటుంది. మంచి సినిమాలు చేయడం, ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడం నా బాధ్యతగా భావిస్తాను. మీతో నాకు ఉన్న ఈ అనుబంధం ఇలాగే కొనసాగాలి. మీ ప్రేమ, ఆదరణ ఎప్పటికీ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.




# మెగా ప్రిన్స్.. అదిరిపోయే లైనప్

వరుస పరాజయాల తర్వాత సరైన కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూసిన మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ ఈ ఏడాది కొరియన్ కనకరాజుతో బాక్సాఫీస్ వద్ద అదిరిపోయే విజయాన్ని అందుకున్నారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో థియేటర్లలో సందడి చేసి మళ్లీ సక్సెస్ ట్రాక్ ఎక్కిన వరుణ్, ఇప్పుడు తన కెరీర్‌ను మరింత వేగంగా, పక్కా ప్లానింగ్‌తో ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం ఆయన లైనప్ చూస్తుంటే టాలీవుడ్‌లో సరికొత్త సంచలనం సృష్టించేలా కనిపిస్తోంది. ప్రస్తుతం వరుణ్ తేజ్ తన చెల్లెలు నిహారిక కొణిదెల సొంత బ్యానర్ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌లో రూపొందుతున్న 'బరి' చిత్రంతో ఫుల్ బిజీగా ఉన్నారు. 'కమిటీ కుర్రాళ్లు' సినిమాతో దర్శకుడిగా తన ప్రతిభను ఘనంగా చాటుకున్న యదువంశీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో, స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా బరి తెరకెక్కుతుంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది.'బరి' సెట్స్‌పై ఉండగానే, వరుణ్ తేజ్ ఖాతాలో మరో రెండు ప్రతిష్టాత్మకమైన భారీ ప్రాజెక్టులు చేరినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో జోరుగా టాక్ వినిపిస్తోంది. అందులో మొదటిది కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు నిర్మాణంలో రానున్న ప్రాజెక్ట్. స్టోన్ బెంచ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై కార్తీక్ సుబ్బరాజు తెలుగులో ఒక డిఫరెంట్ క్రైమ్ లేదా గ్యాంగ్‌స్టర్ డ్రామాను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారని, అందులో వరుణ్ తేజ్ లీడ్ రోల్ చేయబోతున్నారని వార్తలు వస్తున్నాయి. సరికొత్త స్క్రీన్‌ప్లే, విభిన్నమైన టేకింగ్‌తో ఈ సినిమా రూపొందనుందని సమాచారం.దీనికితోడు టాలీవుడ్ క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ సమర్పణలో, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌లో మరో క్రేజీ ప్రాజెక్ట్ లైన్‌లోకి వచ్చినట్లు తెలుస్తోంది. కంటెంట్ ఓరియెంటెడ్ కథలతో పాటు కమర్షియల్ సక్సెస్‌లను అందించడంలో సుకుమార్ రైటింగ్స్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఆ బ్యానర్‌లో రూపొందే కథలు ఎంత సహజంగా, గ్రిప్పింగ్‌గా ఉంటాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. వరుణ్ తేజ్ కోసం కూడా ఒక బలమైన ఎమోషనల్ అండ్ ఇంటెన్స్ డ్రామాను సిద్ధం చేసినట్లు వినికిడి.ఫిలింనగర్ సమాచారం ప్రకారం, ప్రస్తుతం నడుస్తున్న 'బరి' పూర్తయిన వెంటనే సుకుమార్ రైటింగ్స్ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి కథ, దర్శకత్వం వహించబోయే దర్శకుడు ఎవరు అనే విషయాలపై త్వరలోనే స్పష్టత రానుంది. సుకుమార్ దగ్గర అసోసియేట్‌గా పనిచేసిన ఒక ప్రతిభావంతుడైన యంగ్ డైరెక్టర్ ఈ సినిమాతో పరిచయం కాబోతున్నట్లు ఇన్‌సైడ్ టాక్.గతంలో ప్రయోగాలకు పెద్దపీట వేసిన వరుణ్ తేజ్, ఇప్పుడు కమర్షియల్ హంగులతో పాటు కథాబలం ఉన్న చిత్రాలను ఎంచుకుంటూ తన మార్కెట్‌ను భారీగా పెంచుకునే పనిలో పడ్డారు.



# ప్రతిష్ఠాత్మక గౌరవం.. గర్వించదగ్గ క్షణం

72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం గుజరాత్‌లోని కేవాడియాలో ఘనంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు సినీ ప్రముఖులు. అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కిన 'పుష్ప 2: ది రూల్' చిత్రానికి ఉత్తమ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్) విభాగంలో సుకుమార్ జాతీయ అవార్డు అందుకున్నారు. అలాగే 'కమిటీ కుర్రోళ్లు' చిత్రానికి కూడా జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. నిర్మాత నిహారిక కొణిదెల అవార్డును స్వీకరించారు. 'కల్కి 2898 ఏడీ', '35.. చిన్న కథ కాదు', 'లక్కీ భాస్కర్' వంటి తెలుగు చిత్రాలు కూడా వివిధ విభాగాల్లో అవార్డులు అందుకున్నాయి. దిగ్గజ నటుడు అనంత నాగ్‌కు ప్రతిష్ఠాత్మక దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును ప్రదానం చేశారు. ఉత్తమ చిత్రంగా ఆర్టికల్ 370, ఉత్తమ నటిగా యామీ గౌతమ్ అవార్డ్ అందుకున్నారు. ఉత్తమ నటుడి కేటగిరీలో మమ్ముట్టి (మలయాళ చిత్రం: భ్రమయుగం), చందు ఛాంపియన్ చిత్రానికిగాను కార్తీక్ ఆర్యన్ అవార్డులు స్వీకరించారు. ఉత్తమ దర్శకుడిగా రాజ్‌కుమార్ పెరియసామి –తమిళ చిత్రం: అమరన్ కు, స్వాతంత్ర్య వీర్ సావర్కర్ సినిమాకు గాను ఉత్తమ తొలి చిత్ర దర్శకుడిగా రణదీప్ హూడా పురస్కారాలు అందుకున్నారు.

Cinema



# ఎక్కడ.. తేడా కొట్టింది?

పాన్ ఇండియా లెవల్లో భారీ హైప్ క్రియేట్ చేస్తున్న క్రేజీ ప్రాజెక్టులలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న రాకా ఒకటి. దీపికా పదుకొణెతో పాటు, మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొట్టిన పుష్ప-2 తర్వాత అల్లు అర్జున్ నుంచి వస్తున్న సినిమా కావడం, అటు జవాన్ తో వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించిన అట్లీ దీనికి దర్శకుడు కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ప్రపంచ స్థాయి సాంకేతిక విలువలతో, అత్యున్నత ప్రమాణాలతో ఈ సినిమాను అట్లీ ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే దర్శకుడు అట్లీ పుట్టినరోజు సందర్భంగా ఏదో ఒక అదిరిపోయే అప్‌డేట్ వస్తుందని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐకాన్ స్టార్ అభిమానులు ఎంతో ఆశగా ఎదురుచూశారు. సోషల్ మీడియాలో సైతం కొన్ని రోజులుగా ఈ బర్త్‌డే స్పెషల్ ట్రీట్ గురించే పెద్ద ఎత్తున చర్చ సాగింది. అయితే మేకర్స్ ఇచ్చిన అప్‌డేట్ మాత్రం ఫ్యాన్స్‌ను ఆశ్చర్యానికి గురిచేయడమే కాకుండా, కాస్త నిరాశకు కూడా గురిచేసింది. ఈ సినిమా కోసం ఏకంగా 37 మంది మోషన్ క్యాప్చర్ (Mo-Cap) ఆర్టిస్టులు ఏకకాలంలో పనిచేశారని, ఇది ప్రపంచంలోనే సరికొత్త చరిత్ర సృష్టిస్తూ 'గిన్నిస్ వరల్డ్ రికార్డ్' సాధించిందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. హాలీవుడ్ స్థాయి విజువల్స్ కోసం భారతీయ సినిమాలో ఇలాంటి భారీ టెక్నాలజీని ఉపయోగించడం కచ్చితంగా గర్వించదగ్గ విషయమే. టెక్నికల్ పరంగా చూస్తే ఇండియన్ సినిమాను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లే ప్రయత్నమిది. అయితే సాధారణ ప్రేక్షకులకు, ముఖ్యంగా మాస్ పల్స్ తెలిసిన బన్నీ అభిమానులకు మాత్రం ఈ రికార్డుల కంటే తెరపై తమ హీరో ఎలా కనిపించబోతున్నాడన్నదే ముఖ్యం. కనీసం ఒక పవర్‌ఫుల్ గ్లింప్స్, పోస్టర్ లేదా అల్లు అర్జున్ ఫస్ట్ లుక్ రివీల్ అవుతుందని భావించిన ఫ్యాన్స్‌కు ఈ మోక్యాప్ రికార్డు ప్రకటన ఒకింత అసంతృప్తినే మిగిల్చింది. అయితే ఆ తర్వాత కొద్దిసేపటికే మేకర్స్ ఒక మేకింగ్ వీడియోను విడుదల చేశారు. దీనితో ఫ్యాన్స్‌లో మళ్లీ కొత్త ఆశలు చిగురించాయి. ఏకంగా నాలుగు నిమిషాల నిడివితో వచ్చిన ఈ వీడియోలో అసలు సినిమా నేపథ్యం ఏమిటి, తెరవెనుక ఎలాంటి మాయాజాలం జరుగుతోందో చూపించారు.కానీ మొత్తం నాలుగు నిమిషాల వీడియో పూర్తయ్యే వరకు కేవలం టెక్నీషియన్ల హడావుడి, సెట్స్, కెమెరా వెనుక వర్క్ మాత్రమే కనిపించింది తప్ప.. చివరి క్షణంలో కూడా ఒక్కటంటే ఒక్క విజువల్ అవుట్‌పుట్ షాట్ కూడా చూపించలేదు. కనీసం లాస్ట్ ఫ్రేమ్‌లోనైనా బన్నీ క్యారెక్టర్‌కు సంబంధించిన చిన్న విజువల్ బిట్‌ను యాడ్ చేసి ఉంటే అభిమానుల ఉత్సాహం వేరే లెవల్లో ఉండేది. ఎలాంటి విజువల్ సర్‌ప్రైజ్ లేకుండా వీడియో ముగియడంతో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వరల్డ్ రికార్డులు సాధించడం గర్వకారణమే, కానీ బర్త్‌డే స్పెషల్‌గా మేము కోరుకున్నది హీరో విజువల్ ట్రీట్ అంటూ అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. అట్లీ లాంటి కమర్షియల్ డైరెక్టర్ నుండి ఇలాంటి ప్యూర్ టెక్నికల్ అప్‌డేట్ మాత్రమే రావడం ఎవరూ ఊహించలేదు. ఏదేమైనా ఈ ప్రాజెక్ట్ ఎంత భారీ స్థాయిలో రూపొందుతోందో ఈ మేకింగ్ వీడియో స్పష్టం చేసింది. ఇక తదుపరి అప్‌డేట్‌లోనైనా మేకర్స్ ఐకాన్ స్టార్ ఫ్యాన్స్ ఆకలి తీర్చేలా ఒక అదిరిపోయే టీజర్ లేదా ఫస్ట్ లుక్ గ్లింప్స్‌తో వస్తారేమో వేచి చూడాలి.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085